దీక్షల్లో కూర్చున్న జివిఎంసి కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ నాయకులు

స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణతో రిజర్వేషన్లకు విఘాతం

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : వైజాగ్ స్టీల్‌ప్లాంట్‌ను ప్రైవేటీకరణ చేస్తే రిజర్వేషన్లు ఉండవని, అదే జరిగితే దళిత, గిరిజనులకు తీవ్ర నష్టం వాటిల్లుతుందని జివిఎంసి కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) అధ్యక్షులు టి.నూకరాజు, ప్రధాన కార్యదర్శి యు.రాజు అన్నారు. అందుకే స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా దళితులు, గిరిజనులు, బిసిలు, మైనారిటీలు పోరాడక తప్పదని స్పష్టం చేశారు. స్టీల్‌ప్లాంట్, ఇతర ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద విశాఖ అఖిలపక్ష కార్మిక, ప్రజా సంఘాల జెఎసి ఆధ్వర్యంలో చేపట్టిన రిలే దీక్షలు శుక్రవారానికి 1072వ రోజుకు చేరాయి. దీక్షల్లో మున్సిపల్ వర్కర్లు కూర్చున్నారు. ఈ సందర్భంగా నాయకులు నూకరాజు, రాజు మాట్లాడుతూ ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటీకరణ చేయడానికి ప్రయత్నిస్తున్న కేంద్ర బిజెపిని, ఆ పార్టీకి మద్దతు తెలుపుతున్న వారిని రానున్న ఎన్నికల్లో చిత్తుగా ఓడించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు జెఆర్.నాయుడు, ఎం.ఈశ్వరరావు, ఇ.ఆదినారాయణ, జగదీష్ పాల్గొన్నారు.

వెలుగులోకి డబ్బుల వసూళ్ల వ్యవహారం

- కెజిబివి తెలుగు సిఆర్‌టి ఎస్‌బిటిఎస్ దేవి పాత్రపై విచారణ పూర్తి
- రుజువు కావడంతో విధుల నుంచి తొలగింపు

ప్రజాశక్తి-అనకాపల్లి ప్రతినిధి

కస్తూర్బాగాంధీ బాలికా విద్యాలయం (కెజిబివి)లో పనిచేస్తున్న కాంట్రాక్ట్ రెసిడెన్షియల్ టీచర్ (సిఆర్‌టి)లను మినిమమ్ టైం స్కేల్(ఎంటిఎస్)లోకి తీసుకొచ్చే పేర డబ్బులు వసూళ్లు చేసిన దేవరాపల్లి కెజిబివిలోని తెలుగు సిఆర్‌టి ఎస్‌బిటిఎస్ దేవిని విధుల నుంచి తొలగిస్తూ జిల్లా విద్యాశాఖాధికారి, సమగ్ర శిక్షా ఎక్స్ అఫిషియో ప్రాజెక్టు కో - ఆర్డినేటర్ ఎం.వెంకట లక్ష్మమ్మ ఉత్తర్వులు జారీచేశారు. డబ్బుల వసూళ్లపై అనకాపల్లి పోలీసులు దేవిపై కేసు నమోదుచేశారు. రాష్ట్ర వ్యాపితంగా 352 కెజిబివిల్లో సిఆర్‌టిలు పనిచేస్తున్నారు. ఎంటిఎస్ పరిధిలోకి వస్తే సిఆర్‌టిల జీతాలు పెరగడంతో పాటు సర్వీస్‌లో బ్రేక్ వుండదని దేవి నమ్మించింది. ప్రతి కెజిబివి నుంచి ఒకరిద్దరు బాధ్యత తీసుకొని ఎన్నికలకు ముందే డబ్బులు వసూలు చేయాలని జిల్లాల కెజిబివి టీచర్ల వాట్సాప్ గ్రూపునకు ఆమె సమాచారం పెట్టారు. రూ.2.80 లక్షలు చొప్పున 352 కెజిబివిల నుంచి వసూలు చేసి ప్రభుత్వంలోని కొందరు పెద్దలకు ఇవ్వాలని ఆమె చెప్పినట్లు సిఆర్‌టిలు అంటున్నారు. కీలకమైన వ్యక్తులకు డబ్బులు ఇచ్చిన వెంటనే మరుసటి రోజు సాయంత్రం ఎంటిఎస్ వర్తింపజేస్తూ ఆదేశాలు వస్తాయని గ్రూపులో సమాచారం పంపించింది.

ఈ సమాచారంపై కొందరు అనుమానంతో సమగ్ర శిక్షా అభియాన్ ఉన్నతాధికారులు, సిఎం పేషీకి ఫిర్యాదు చేయడంతో ఉన్నత స్థాయి అధికారి రంగంలోకి దిగి పూర్తి విచారణ చేయాలని అధికారులకు ఆదేశించారు. కెజిబివి టీచర్ల గ్రూపులకు డబ్బులు ఇవ్వాలని వచ్చిన సమాచారం నిజమేనని విచారణలో తేలడంతో అధికారుల ఆదేశాల ప్రకారం దేవిని విధుల నుంచి తొలగించారు.

ప్రత్యర్థుల కలయిక

దాడి ఇంటికి కొణతాల
కలిసి పనిచేయడంపై అనుమానాలు

కార్యకర్తలతో దాడి వీరభద్రరావు, కొణతాల రామకృష్ణ

ప్రజాశక్తి-అనకాపల్లి ప్రతినిధి

మాజీ మంత్రి, అనకాపల్లి నియోజకవర్గ జనసేన అభ్యర్థి కొణతాల రామకృష్ణ రాజకీయ ప్రయోజనం కోసం మెట్టు దిగారు. దశాబ్దాలపాటు రాజకీయ ప్రత్యర్థిగావున్న టిడిపి సీనియర్ నాయకుడు దాడి వీరభద్రరావు ఇంటికి వెళ్లి చేయి కలిపారు. ఎదురుపడినా మనస్ఫూర్తిగా పలకరించుకోలేని దాడి, కొణతాల సిగ్గు బిడియం లేకుండా కలవడం చర్చనీయాంశంగా మారింది. వైసిపిని వీడిన ఇద్దరూ ఒక పార్టీలో ఇమడలేక, కలిసి పనిచేయలేక తమ రాజకీయ ఉనికి కోసం వేర్వేరు పార్టీలను ఎంచుకున్నారు. ఒక రాజకీయ ప్రత్యర్థితో కలిసి పనిచేయాల్సిన పరిస్థితులొస్తాయని మరొక ప్రత్యర్థి ఊహించలేకపోయారు. తన రాజకీయ జీవితాన్ని చెడగొట్టడానికి వీడొచ్చినట్లుందని ఎవరికివారు తన అనుయాయుల వద్ద నిన్నటి వరకు మాట్లాడిన ఇద్దరూ ఇప్పుడు కలిసి పనిచేస్తామని మాట్లాడ్డాన్ని వారి అనుయాయులే నమ్మలేకపోతున్నారు. శుక్రవారం అనకాపల్లిలోని దాడి ఇంటికి వెళ్లిన కొణతాల ఎన్నికల్లో సహకరించాలని కోరారు. శత్రువైనా ఇంటికొచ్చి సహాయం అడిగితే కాదనకూడదనేమో కొణతాల విజయానికి కలిసి పనిచేస్తామని దాడి అన్నారు. వీరభద్రరావు స్థిరంగా ఒక పార్టీలో లేకపోవడం, దాదాపు పదేళ్లుగా ప్రత్యక్ష రాజకీయాలకు కొణతాల దూరంగా వుండడంతో వారి వెనుకవున్న అనుచరులు చెల్లాచెదురయ్యారు. పట్టణంలోని చెదిరిపోయిన గుంపును ఒకచోటకు చేర్చే పని వారిద్దరూ ఎవరికివారు చేస్తున్నారు. పుట్టి, పెరిగిన గడ్డపై మళ్లీ తమ పట్టు పెంచుకోవాలని ప్రయత్నిస్తున్నారు. ఆ నేపథ్యంలోనే వచ్చే ఎన్నికల్లో క్రియాశీలకంగా వ్యవహరించాలని వేర్వేరు పార్టీల్లో కొణతాల, దాడి చేరారు.

అయితే, పరిస్థితులు తారుమారయ్యాయి. టిడిపిలో చేరిన దాడి కుటుంబానికి ఎన్నికల్లో పోటీచేసే అవకాశాన్ని చంద్రబాబు ఇవ్వలేదు. పొత్తులో అనకాపల్లి టిక్కెట్ జనసేన అభ్యర్థి కొణతాలకు కేటాయించారు. మళ్లీ వేరే పార్టీలో చేరే అవకాశంలేక అనివార్యంగా కొణతాల విజయానికి పనిచేస్తానని దాడి చెప్పకతప్పలేదు. కొణతాల కూడా అనివార్య పరిస్థితుల్లోనే దాడిని కలిసి మద్దతు కోరినట్లు కన్పిస్తోంది. ఇప్పటివరకు కొణతాల కలిసిన నలుగురు నాయకుల్లో సీనియర్ నాయకుడు దాడి. అయినా కొణతాల తొలుత జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ పరుచూరి భాస్కరరావును కలిశారు. తరువాత టిడిపి జిల్లా అధ్యక్షుడు బుద్ధ నాగజగదీశ్వరరావు, మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ వద్దకు వెళ్లారు. ఆఖరిలో దాడి ఇంటికి వెళ్లి కలిశారు. సీనియర్ నాయకుడైన దాడి ఇంటికి వెళ్లి మర్యాదపూర్వకంగా కలవాల్సివున్నా, ఆ ధర్మం కొణతాల పాటించలేదు. ఎన్నికల్లో ప్రత్యర్థులను దూరం చేసుకోకూడదన్న ఆలోచనతో దాడిని కొణతాల కలిసినా చివరిలో ఆయన ఇంటికి వెళ్లడం అవమానపర్చినట్లయింది. ఈ కలయిక ఎటువంటి మలుపులకు దారితీస్తుందో, దాడి సహకారం ఎంతవరకు లభిస్తుందో ఎన్నికలు సమీపిస్తున్న కొద్దీ బయటపడుతుంది. అయితే వీరిరువురూ కలిసి పనిచేయడంపై నేటికీ పలువురిలో అనుమానాలున్నాయి.

కొణతాల గెలుపునకు ప్రతి ఒక్కరూ పని చేయాలి : దాడి

అనకాపల్లి : టిడిపి, జనసేన ఉమ్మడి అభ్యర్థి కొణతాల రామకృష్ణ విజయానికి ప్రతి ఒక్కరూ పని చేయాల్సిన అవసరముందని తెలుగుదేశం పార్టీ సీనియర్ నేత దాడి వీరభద్రరావు అన్నారు. గవరపాలెంలోని దాడి నివాసానికి మాజీ మంత్రి కొణతాల రామకృష్ణ శుక్రవారం వెళ్లి కలిశారు. ఈ సందర్భంగా దాడి, ఆయన అనుచరులూ రామకృష్ణకు ఘన స్వాగతం పలికారు. రాజకీయ అంశాలపై ఇరువురి నేతలూ చర్చించుకున్నారు. ఈ సందర్భంగా వీరభద్రరావు మాట్లాడుతూ రాష్ట్రం అరాచక పాలన వల్ల అధోగతి పాలవుతోందన్నారు. భూకబ్జాదారులు సంఘ విద్రోహక శక్తులు పెట్రేగిపోతున్నారని తెలిపారు. కొణతాల రామకృష్ణ మాట్లాడుతూ దాడి వీరభద్రరావు కుటుంబంతో కాలేజీ సమయం నుంచీ అనుబంధం ఉందన్నారు. రాజకీయంగా విభేదించాల్సిన పరిస్థితి నెలకొందని, తిరిగి మళ్ళీ కలిసి పనిచేసే అవకాశం ఏర్పడిందని చెప్పారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు కొణతాల సత్యనారాయణ, మల్ల రాజా, దాడి జగన్ ప్రభాకర్, విల్లూరి రాము, కాంద్రేగుల కృష్ణప్పారావు, బొడ్డపాటి రాజారావు, బుడ్డెద శంకరరావు, కోటిపల్లి జేజి బాబు పాల్గొన్నారు.

ప్రతిభగల విద్యార్థులకు ఉపకారవేతనాలు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : అమెరికన్ తెలుగు ప్రొగ్రెసివ్ అసోసియేషన్ (ఆప్తా) అధ్వర్యంలో ఆదివారం ఉదయం విశాఖపట్నంలోని ఆళ్వారుదాసు విద్యాసంస్థ ఐఐఎం కళాశాల వేదికగా ప్రతిభ కలిగిన పేద విద్యార్థులకు ప్రతి ఏటా ఇచ్చే స్కాలరుషిప్పులు పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. శ్రీకాకుళం, అల్లూరి సీతారామరాజు, పార్వతీపురం, విజయనగరం, అనకాపల్లి, విశాఖపట్నం జిల్లాల నుండి ఎంపికచేయబడిన విద్యార్థులకు స్కాలర్‌షిప్పులు అందించనున్నట్టు కార్యక్రమ సమన్వయకర్తలు సుహాస్ బలిరెడ్డి, నవీన్ కుమార్ పాశం తెలిపారు. అతిథులుగా సిబిఐ మాజీ జేడీ లక్ష్మీనారాయణ, నండూరి సాంబశివరావు, సుంకరి రాజేంద్ర, దిలీప్ చక్రవర్తి బైరా విచ్చేయనున్నట్టు ఆప్తా సంస్థ ప్రెసిడెంట్ త్రినాధ్ ముద్రగడ, జాబ్స్ కమిటీ చైర్మన్ శ్రీరామ్ సుంకరి, ఎఎస్ఇపి చైర్మన్ అనిల్ కుమార్ వీరిశెట్టి తెలిపారు.

'వైజాగ్ విజన్' ప్రణాళిక ఎవరి కోసం ?

- విశ్రాంత ఐఎఎస్ అధికారి ఇఎఎస్.శర్మ

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : ప్రభుత్వం ప్రకటించిన వైజాగ్ విజన్ ప్రణాళిక ఎవరి కోసమని విశ్రాంత ఐఎఎస్ అధికారి ఇఎఎస్.శర్మ ప్రశ్నించారు. ఈ మేరకు పలు అంశాలతో కూడిన లేఖను రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్ రెడ్డికి శుక్రవారం రాశారు. రాష్ట్ర ప్రభుత్వం తయారు చేసిన విజన్ విశాఖను పూర్తిగా తాను పరిశీలించానన్నారు. ఆ ప్రణాళిక హంగులు చూస్తే ప్రజల సమస్యల మీద అవగాహన లేని ప్రైవేట్ కన్సల్టెంట్‌ల చేత తయారు చేయించిన పత్రంలా ఉందన్నారు. ఆ ప్రణాళిక కోసం ప్రభుత్వం పెద్ద ఎత్తున ఖర్చు చేసి ఉంటుందని తెలిపారు. కన్సల్టెంట్‌లు బదులు విశాఖ ప్రజల అభిప్రాయాలు సేకరించి, దీర్ఘకాలిక ప్రణాళికను వారి సమస్యల పరిష్కారం కోసం తయారు చేసి ఉంటే తక్కువ ఖర్చుతో ప్రభుత్వం సరైన ప్రణాళికను ప్రజల ముందు ఉంచేదని అభిప్రాయపడ్డారు. విశాఖ నగరం ప్రగతికి వ్యవసాయం, గ్రామాలలో పాడి పరిశ్రమ, తీరప్రాంతంలో సాంప్రదాయ మత్స్య పరిశ్రమ ఎంతగానో దోహదపడ్డాయన్నారు. వాటి గురించి ప్రణాళికలో ప్రస్తావించలేదంటే ఆ ప్రణాళిక విలువ గురించి ప్రజలకు ఇట్టే అర్థమవుతుందన్నారు. నగరంలోని మురికివాడలు, వాటిలో నివసిస్తున్న డెబ్బై లక్షల మందికిపైగా చిన్నకారు ప్రజల పరిస్థితి గురించి ప్రణాళికలో ప్రస్తావన లేదన్నారు. విశాఖ నగరం చుట్టుపక్కల ఆలోచనా రహితంగా కాలుష్యం కలిగించే పరిశ్రమలకు అనుమతులిచ్చి, ప్రజల నీటిని వారికి తరలించడం వల్ల నీటి సమస్య వచ్చే అవకాశం ఉందన్నారు. తాగునీటిపైనా ప్రణాళికలో పేర్కొనలేదన్నారు. విశాఖ ప్రజల అభిప్రాయాలు సేకరించకుండా ఇటువంటి ప్రణాళికలను తయారు చేయడం ప్రజల నిధులను వ్యర్థం చేయడమే అవుతుందని పేర్కొన్నారు.

శ్రామిక మహిళలతో కృష్ణ మెటర్నటీ నర్సింగ్ హోమ్ వైద్యులు, సిబ్బంది

శ్రామిక మహిళలకు సన్మానం

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : నగరంలో గుర్తింపు పొందిన రైల్వే న్యూ కాలనీలోని కృష్ణ మెటర్నటీ నర్సింగ్ హోమ్‌లో శుక్రవారం అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నలుగురు శ్రామిక మహిళలను సత్కరించారు. సత్కారం పొందిన వారిలో కూరగాయల వ్యాపారం చేసే అనకాపల్లి జిల్లా మునగపాకకు చెందిన కె.వెంకటలక్ష్మి, విజయనగరం జిల్లా కొత్తవలసకు చెందిన పి.ఎల్లమ్మ, రైల్వే న్యూ కాలనీలో పాల బూత్ నిర్వహిస్తున్న ఎం.జయ, 39 ఏళ్లుగా నర్సింగ్ హోమ్‌లో అటెండర్‌గా పనిచేస్తున్న ఎం.కనకలను సత్కరించారు. ఈ సందర్భంగా డాక్టర్ కె.కమల మాట్లాడుతూ సత్కారం పొందిన నలుగురు ప్రత్యేక లక్షణాలు కలిగిన శ్రమజీవులని, వారిలోని మంచి లక్షణాలను గుర్తించి ప్రతి ఒక్క మహిళా స్ఫూర్తిపొందాలని కోరారు. కార్యక్రమంలో డాక్టర్ బి.శ్రీదేవి, డాక్టర్ బి.తేజస్వి ప్రభంజన, గైనకాలజిస్టులు జి.సుహాసిని, సుజారాజ్, పి.వనజ, పి.వేణు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న సైన్స్ అండ్ ఆర్ట్ ఎగ్జిబిషన్

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : పెదవాల్తేరులోగల సన్‌ఫ్లవర్ ప్రత్యేక పాఠశాలలో నిర్వహించిన సైన్స్ అండ్ ఆర్ట్ ఎగ్జిబిషన్ ఎంతగానో ఆకట్టుకుంది. సుమారు వంద మంది విభిన్న ప్రతిభావంతులు తమ ప్రతిభతో ఇక్కడ సైన్స్ నమూనాలను ప్రదర్శించారు. కాలుష్య నివారణ, నీటి సంరక్షణ, చారిత్రక కట్టడాలు, గృహోపకరణాలు వంటి ప్రదర్శనలు ఏర్పాటు చేశారు.

వాలీబాల్ ఆడుతున్న క్రీడాకారులు

రసవత్తరంగా ఉత్తరాంధ్ర వాలీబాల్ పోటీలు

ప్రజాశక్తి-అనకాపల్లి : మహాశివరాత్రిని పురస్కరించుకుని అనకాపల్లి వాలీబాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గురు, శుక్రవారాలలో దిబ్బవీధి కొబ్బరి తోటలో నిర్వహిస్తున్న ఉత్తరాంధ్రస్థాయి వాలీబాల్ పోటీలు రసవత్తరంగా సాగాయి. ఈ పోటీలను ఆదినారాయణ మహిళా కళాశాల కరస్పాండెంట్ కొణతాల రఘునాథ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడాకారుల కోరిక మేరకు రాష్ట్రస్థాయిలో క్రీడలు నిర్వహించేందుకు తన వంతు ప్రోత్సాహం అందజేస్తామని ప్రకటించారు. యువత చెడు మార్గాలకు వెళ్లకుండా క్రీడలు దోహదపడతాయన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ పీలా లక్ష్మీ సౌజన్య, ఎస్టి గ్రూప్ అధినేత కాంద్రేగుల శ్రీరామ్, సామాజిక వేత్త గంటి రవి కుమార్, జార్జి క్లబ్ కార్యదర్శి బుద్ధ కాశీ విశ్వేశ్వరరావు, సీనియర్ జర్నలిస్టు మద్దాల కృష్ణ, పోటీల నిర్వాహకులు ఎల్లపు గోవింద, బుద్ధ శివ, పెంటకోట చిన్న, విల్లూరు ప్రసాద్, కేఎం నాయుడు, ఆళ్ల సంతోష్, ఎల్లపు సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు. పోటీలకు రెఫరీలుగా గిరి, మోహన్‌రావు వ్యవహరించారు.

వీరబ్రహ్మేంద్రస్వామి రథోత్సవం

ప్రజాశక్తి-అనకాపల్లి : శ్రీమద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి రథోత్సవం శుక్రవారం పట్టణంలో ఘనంగా నిర్వహించారు. ఆలయం నుండి బయలుదేరి పట్టణ పురవీధుల గుండా ఊరేగింపుగా కామాక్షమ్మ ఆలయానికి చేరుకుంది. ఈ కార్యక్రమంలో కార్పెంటర్ సంఘం శాశ్వత గౌరవ అధ్యక్షులు కోసూరి మన్మధరావు, అధ్యక్షులు వానపల్లి కోటేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి సింహాద్రి కోటేశ్వరరావు, కోశాధికారి మునాసన రామకృష్ణ, పట్టణ కామాక్షి కార్పెంటర్స్ సభ్యులు, పట్టణ విశ్వబ్రాహ్మణ సంఘం సభ్యులు సభ్యులు పాల్గొన్నారు.

ఘనంగా శ్రీసాయి విద్యా నికేతన్ ద్వితీయ వార్షికోత్సవం

ప్రజాశక్తి - పరవాడ : మండలంలోని గొర్లివానిపాలెంలో ఉన్న శ్రీసాయి విద్యా నికేతన్ ద్వితీయ వార్షికోత్సవం గురువారం రాత్రి ఘనంగా నిర్వహించారు. చిన్నారులు రామాయణంలో పాత్రలు, కళ్ళకు కట్టినట్లు చూపించారు. ముఖ్య అతిథులుగా మాజీ మంత్రి బండారు సత్యనారాయణమూర్తి, రిటైర్డ్ ఐఎఎస్ అధికారి శివ శంకర్ హాజరయ్యారు. కళాశాల కరస్పాండెంట్ రంగారావు మాట్లడుతూ పాఠశాలలో విద్యార్థుల అభివృద్ధికి, మనోవికాసానికి ఉపయోగపడే విధంగా అనేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. అనంతరం సాంస్కృతిక, కాన్సెప్టబుల్ థీమ్స్ భావనాత్మక నేపథ్యంతో విద్య యొక్క ఆవశ్యకత మెళకువలు, చాలా చక్కగా ప్రదర్శించారు.

మహిళను సన్మానిస్తున్న బండారు, శివశంకర్, పాఠశాల యాజమాన్య ప్రతినిధులు

పోలీస్ శాఖలో ఉద్యోగాల పేరిట మోసం

సుమారు రూ.3 కోట్ల వసూళ్లు

ఉద్యోగాల పేరిట మోసం చేసిన జంట (ఫైల్‌ఫొటో)

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : విశాఖలో భారీ మోసం వెలుగు చూసింది. పోలీస్ డిపార్టుమెంట్‌లో ఉద్యోగాలు ఇప్పిస్తామంటూ ఓ ప్రేమ జంట మోసాలకు పాల్పడింది. నకిలీ పోలీసుల అవతారం ఎత్తడమే కాకుండా ఎంతోమంది అమాయకుల వద్ద నుంచి సుమారు రూ.3 కోట్ల రూపాయలు వసూలు చేసినట్టు భోగట్టా. డిపార్టుమెంట్‌లో తమకు చాలా పరిచయాలు ఉన్నాయని, లక్షలు చెల్లిస్తే పోలీసు ఉద్యోగాలు గ్యారెంటీ అని చెప్పడమే కాకుండా వారికి నమ్మకం కలిగించేందుకు యూనిఫాంలో ఉన్న ఫొటోలను సైతం చూపించి బురిడీ కొట్టించారు. ఇలా సుమారు 30 మంది నుంచి రూ.10 లక్షల చొప్పున మూడు కోట్ల రూపాయల వరకూ వసూలు చేశారు. నెలలు గడుస్తున్నా ఉద్యోగాలు రాకపోవడంతో అనుమానం వచ్చిన బాధితులు విశాఖ పోలీసులను ఆశ్రయించారు. బాధితుల ఫిర్యాదు మేరకు వారు కేసు నమోదు చేశారు. నిందితుడు హనుమంతు రమేష్, అతని ప్రియురాలు కోసం ప్రత్యేక బృందాలు గాలింపు చర్యలు చేపట్టాయి. వీరిద్దరూ హైదరాబాదులో ఉన్నట్లు సమాచారం అందుకున్న పోలీసులు అక్కడికి వెళ్లి వారిని అరెస్టు చేశారు. ఉద్యోగాల పేరుతో మోసాలే కాకుండా బొమ్మ తుపాకీ పెట్టుకొని పలువురిని బెదిరించి వసూళ్లకు కూడా పాల్పడినట్టు విచారణలో తేలిందని పోలీసులు వెల్లడించారు. హనుమంతు రమేష్‌కు ఇప్పటికే పెళ్లై ఇద్దరు భార్యలు ఉండగా ఇప్పుడు మరో ప్రియురాలితో సహజీవనం చేస్తున్నట్లు తెలిసింది. నిందితుల నుంచి పూర్తి సమాచారం సేకరించిన తర్వాత మరిన్ని వివరాలు తెలియజేస్తామని పోలీసులు చెప్పారు. ఉద్యోగాలు ఇప్పిస్తామంటూ మాయమాటలు చెప్పే వారిని నమ్మొద్దు అంటూ హెచ్చరించారు. ఇలా ఎవరైనా పాల్పడితే తమకు సమాచారం ఇవ్వాలని సూచించారు.

మహిళా సాధికారత దిశగా 'కలలకు రెక్కలు'

ప్రజాశక్తి- కె.కోటపాడు : మహిళా సాధికారత దిశగా టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు, జనసేన అధినేత పవన్ కళ్యాణ్ 'కలలకు రెక్కలు' పేరుతో సరికొత్త పథకాన్ని ప్రకటించారని టిడిపి నియోజకవర్గం ఇన్‌ఛార్జి పివిజి.కుమార్ అన్నారు. మండలం కేంద్రంలో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ఏ ఆడబిడ్డ డబ్బుల కొరతతో చదువుకు దూరమై ఇంటికి పరిమితం కాకూడదనే ఆలోచనతో టిడిపి అధికారంలోకి వచ్చిన తరువాత ఈ పథకాన్ని అమలు చేస్తామని చెప్పారు. ఇంటర్మీడియట్ పూర్తి చేసిన మహిళలు ఈ పథకం కింద దరఖాస్తు చేసుకునేందుకు అర్హులని పేర్కొన్నారు. ఈ సమావేశంలో టిడిపి నాయకులు కసిరెడ్డి అప్పల నాయుడు, కన్నూరు సూర్యనారాయణ, లెక్కల మల్లేశ్వరరావు, సబ్బవరపు రామానాయుడు, జురెడ్డి రాము, లెక్కల అవతారమూర్తి, రాళ్ళపల్లి శ్రీరామ్మూర్తి, అక్కన్న పాత్రుడు, పైల నారాయణమూర్తి, రావాడ రమణ, రామునాయుడు, లెక్కల శ్రీధర్, ముచ్చ పాత్రుడు, మాజీ సర్పంచ్‌లు బత్తి రమణ, రొంగలి అప్పలనాయుడు పాల్గొన్నారు.

మునగపాక : స్థానిక టిడిపి కార్యాలయంలో జిల్లా తెలుగు మహిళ అధ్యక్షురాలు ఆడారి మంజు అధ్యక్షతన జరిగిన మహిళా దినోత్సవంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న టిడిపి ఎలమంచిలి నియోజకవర్గ ఇన్చార్జ్ ప్రగడ నాగేశ్వరరావు మాట్లాడారు. టిడిపి, జనసేన ప్రకటించిన కలలకు రెక్కలు పథకం ద్వారా మహిళలకు వృత్తిపరమైన విద్యకు మార్గదర్శకాలు అందించడంతోపాటు వారికి మరింత ఉపాధి అవకాశాలు కల్పించడం జరుగుతుందని చెప్పారు. కార్యక్రమంలో నర్సీపట్నం జెడ్పీటీసీ సుకల రమణమ్మ, తెలుగు మహిళ నాయకులు కడియం అనురాధ, ఆడారి జానకి, పోతల రమణమ్మ, రమాదేవి, వరలక్ష్మి, రేబాక మాలతి, పెంటకోట స్వాతి, దేవి టిడిపి నాయకులు పాల్గొన్నారు.

వెంకటేశ్వరస్వామి కల్యాణ రాట

ప్రజాశక్తి -వడ్డాది : బుచ్చయ్యపేట మండలం వడ్డాది శ్రీవెంకటేశ్వర స్వామి 151 కళ్యాణోత్సవాలకు సంబంధించి కళ్యాణరాటను శుక్రవారం ప్రతిష్టించారు. ఆలయ ధర్మకర్తలు దొండా కన్నబాబు, దొండ శ్రీరామ్మూర్తి, అర్చకులు శ్రీకాంత్ ఆచార్యులు కళ్యాణరాట వేయించారు. ఈనెల 19న రాత్రి స్వామివారి దొంగ పెళ్లితో ఉత్సవాలు ప్రారంభమై 25వ తేదీన పుష్పాంజలితో ముగుస్తాయని తెలిపారు. 24న వసంతోత్సవం నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో ఈవో శర్మ, గ్రామ పెద్దలు దొండ సన్యాసిరావు, ఆడప నరసింహమూర్తి, సయ్యపు రెడ్డి సత్యనారాయణ పాల్గొన్నారు.

రేపటి నుంచి ఉచిత యోగా శిబిరం

ప్రజాశక్తి అచ్యుతాపురం : రాజయోగ మెడిటేషన్ సెంటర్ ఆధ్వర్యంలో ఆది, సోమ, మంగళవారాల్లో మూడు రోజులపాటు ఉచిత యోగా శిబిరం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి కలిగిన వారు రాజయోగ మెడిటేషన్ సెంటర్ ఎస్‌కేఆర్ రెసిడెన్సి ఎదురుగా, మరిడితల్లి గుడి దగ్గర, అచ్చుతాపురం అడ్రస్‌లోగాని, 9396532321 నెంబర్లో గాని సంప్రదించాలని కోరారు.

ఉచిత వైద్య శిబిరం

ప్రజాశక్తి-అనకాపల్లి : మహాశివరాత్రిని పురస్కరించుకొని శుక్రవారం అనకాపల్లి ఆయుష్ డిపార్ట్మెంట్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. స్థానిక కాశి విశ్వేశ్వర ఆలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో సుమారు 120 మందికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో అనకాపల్లి ఆయుష్ వైద్యశాల డాక్టర్ లావణ్య, సిబ్బంది పాల్గొన్నారు.

గ్రామాల్లో పోలీసు కవాతు

ప్రజాశక్తి- మునగపాక : రాబోయే సార్వత్రిక ఎన్నికలు ప్రశాంతంగా జరగడానికి సహకరించాలని కోరుతూ మండల కేంద్రం మునగపాకతో పాటు గంటవానిపాలెం, చూచుకొండ, గణపర్తి, పి.ఆనందపురం, ఉమ్మలాడ, నాగులపల్లి, రాజుపేట, కాకరపల్లి తదితర గ్రామాల్లో శుక్రవారం పోలీస్ కవాతు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ట్రైనీ డీఎస్పీ భవ్యరెడ్డి, ఎలమంచిలి సిఐ గఫూర్, స్థానిక ఎస్సై ప్రసాదరావు పాల్గొన్నారు.

ట్రైనీ డిఎస్‌పి భవ్యారెడ్డి ఆధ్వర్యాన కవాతు నిర్వహిస్తున్న పోలీసులు

ఎడ్ల పరుగు పందెం నిర్వహిస్తున్న దృశ్యం

జిల్లా స్థాయి ఎడ్ల పరుగు పందెం

ప్రజాశక్తి- సబ్బవరం : మండలంలోని మొగలిపురం గ్రామంలో శ్రీవీరాంజనేయ తీర్థ మహోత్సవం సందర్భంగా జిల్లాస్థాయి ఎడ్లబండ్ల పోటీలు శుక్రవారం నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే గండి బాబ్జి ఆధ్వర్యాన జరిగిన ఈ పోటీలను మాజీ ఎంపీటీసీ గండి రవికుమార్, మాజీ ఎంపీపీ గండి దేముడు ప్రారంభించారు. ఈ పోటీల్లో నెక్కలవానిపాలెంకి చెందిన శ్రీపైడితల్లమ్మ ప్రథమ బహుమతి రూ.15000, అర్జునగిరికి చెందిన పరవాడ నాయుడు ద్వితీయ బహుమతి రూ.12,000, కెఎల్‌బి.పట్నంకు చెందిన సిరికి దుర్గాప్రసాద్ తృతీయ బహుమతి రూ.10,000, నెక్కలవానిపాలెంకు చెందిన వెంకట కోమలి నాలుగవ బహుమతి రూ.8000, లక్కవరంకు చెందిన నేమాలి నరేష్ ఐదవ బహుమతి రూ.6000, కెఎల్‌బి పట్నంకు చెందిన ఓబులరెడ్డి మోహన్ ఆరో బహుమతి రూ.4000, వాయలపాడుకు చెందిన గండి వెంకటరావు ఏడవ బహుమతి రూ.2000 గెలుచుకున్నారు. వీరికి గండి రవికుమార్, గండి దేముడు చేతుల మీదుగా నగదు బహుమతులు అందజేశారు. చిన్నపిల్లల కోలాటం, మధ్యాహ్నం అన్న సమారాధన, సాయంత్రం సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తమరాన బంగారు నాయుడు, బయలుపూడి సత్యం, వెన్నెల శంకర్, కోటాన దేవుడు, అంగటి నాని, గండి దేవుళ్ళు, గండి సతీష్, బోను నాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా తీర్థ మహోత్సవాలు

ప్రజాశక్తి-దేవరాపల్లి : మండలంలోని ఒడ్డిచింతల కళ్లాలు, కొల్లివారి కళ్లాలు, తగరంపూడి కళ్లాలలో పేరంటాలు తీర్థ మహోత్సవలు శుక్రవారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. భారీ అన్న సమారాధనలు ఏర్పాటు చేశారు. డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు పేరంటాలు అమ్మవారిని దర్శించుకున్నారు. స్థానిక వీరబ్రహ్మం స్వామి ఆలయంలో బూడి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం వడ్డిచింతల కళ్లాలు వారు ఏర్పాటు చేసిన జిల్లా స్థాయిఎడ్ల పరుగు ప్రదర్శనలో విజేతలకు డిప్యూటీ సీఎం బూడి బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో వైసీపీ జిల్లా ఉపాధ్యక్షులు కిలపర్తి భాస్కరరావు, వెలమ కార్పొరేషన్ డైరెక్టర్ వరదపురెడ్డి సింహాచలం నాయుడు, మొల్లి కృష్ణమూర్తి, గండిపడాల అప్పలరాజు, గుండు రాంబాబు, సోమిరెడ్డి పేరునాయుడు తదితరులు పాల్గొన్నారు.

విజేతకు నగదు బహుమతి అందిస్తున్న డిప్యూటీ సిఎం బూడి తదితరులు

సిసి కెమేరాల ఏర్పాటుపై అవగాహన

మాట్లాడుతున్న ఎస్ఐ మన్మధరావు

ప్రజాశక్తి- గాజువాక : అపార్ట్‌మెంట్లలో తప్పనిసరిగా సిసి కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని గాజువాక క్రైం ఎస్ఐ మన్మధరావు అన్నారు. శుక్రవారం సాయంత్రం తోకాడలోని సమైక్య అపార్ట్‌మెంట్‌లో సిసి కెమెరాల ఏర్పాటుపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, చోరీలు, నేరాలు పట్ల అపార్టుమెంట్ వాసులు అప్రమత్తంగాఉండాలని, ఏదైనా ఆపద వస్తే వెంటనే పోలీసులకు ఫోన్ చేయాలన్నారు. సిసి కెమరాలకు ఏర్పాటు ద్వారా నేరాలకు సంబంధించి ఆధారాలు లభ్యమే కేసు చేధించడం సులువవుతుందన్నారు. ఆన్‌లైన్ మోసాలు, ఫేస్‌బుక్ ఛాటింగ్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలన్నారు. మహిళలు ఒంటరిగా బజారుకు, బయటకు వెళ్లినప్పుడు చైన్ స్నాచింగ్‌పై జాగ్రత్త వహించాలన్నారు. అసోసియేషన్ మహిళా అధ్యక్షురాలు మణి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు ఎం.వెంకటేశ్వరరావు, కార్యదర్శి ఎ.తవిటయ్య, ఐద్వా జిల్లా అధ్యక్షులు బి.పద్మ, కె.వరలక్ష్మి, కె.వేణు, అపార్టుమెంట్ వాసులు పాల్గొన్నారు.

గీతం కెమిస్ట్రీ విభాగాధిపతిగా డాక్టర్ వేణుగోపాల్

డాక్టర్ వేణుగోపాల్

ప్రజాశక్తి- మధురవాడ : గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం, స్కూల్ ఆఫ్ సైన్స్ రసాయనిక శాస్త్ర విభాగాధిపతిగా ప్రొఫెసర్ ఎన్‌వివిఎస్ వేణుగోపాల్ నియమితులయ్యారు. 31ఏళ్ల బోధనా, పరిశోధనా అనుభవం గల డాక్టర్ వేణుగోపాల్ ఇంజనీరింగ్ కెమిస్ట్రీలో ఎమ్‌ఫిల్ డిగ్రీతో పాటు అనలిటికల్ కెమిస్ట్రీలో పిహెచ్‌డి చేశారు. వ్యవసాయరంగంలో క్రిమిసంహారకాల ప్రభావం, ఆహార ఉత్పత్తులలో రసాయన సమ్మేళనాల విశ్లేషణ, పర్యావరణ రసాయన శాస్త్రంలో నిపుణులైన డాక్టర్ వేణుగోపాల్ 8 మంది పరిశోధకులకు పిహెచ్‌డి గైడ్‌గా మార్గదర్శకం వహించారు. 32కు పైగా జాతీయ, అంతర్జాతీయ సదస్సులలో పాల్గొని ఉత్తమ పరిశోధనా పత్రాలకు అవార్డులు అందుకున్నారు. గీతం విద్యార్థి వ్యవహారాలు, అడ్మిషన్ల విభాగంలో డిప్యూటీ డైరక్టర్ హోదాలో సేవలందించారు. బాధ్యతల స్వీకరణ సందర్భంగా డాక్టర్ వేణుగోపాల్ మాట్లాడుతూ, పరిశ్రమలతో మెరుగైన సంబంధాలు, జాతీయ స్థాయి పరిశోధనా ప్రాజెక్టుల నిర్వహణకు కృషి చేస్తానన్నారు.

రాజకీయ చైతన్యంతోనే మహిళల పురోభివృద్ధి

ప్రజాశక్తి- సీతమ్మధార : మహిళల్లో రాజకీయ చైతన్యం వస్తేనే సామాజికంగా, ఆర్థికంగా పురోభివృద్ధి సాధ్యమని రాజ్యసభ సభ్యులు గొల్ల బాబూరావు అన్నారు. దళితులు రాజకీయాల్లోకి ప్రవేశించాలని పిలుపునిచ్చారు. శుక్రవారం అంబేద్కర్ భవన్‌లో అంబేద్కర్ మెమోరియల్ సొసైటీ ఆధ్వర్యంలో 'మహిళా సాధికారత –ప్రభుత్వ విధానాలు' అంశంపై సదస్సులో మాట్లాడుతూ. రాజ్యాంగం కల్పించిన హక్కులను సద్వినియోగం చేసుకోవాలంటే దళితులు, మహిళలు రాజకీయంగా ఎదగాలన్నారు. సమస్యల పరిష్కారానికి రాజ్యాధికారం ఒకటే మార్గమన్నారు. దామోదర్ సంజీవయ్య లా వర్సిటీ ప్రొఫెసర్ సుధ మాట్లాడుతూ ఉన్నత విద్యతో దళితులు అభివృద్ధి చెందాలని, మహిళల్లో రాజకీయ చైతన్యం రావాలన్నారు. అంబేద్కర్ మెమోరియల్ సొసైటీ అధ్యక్షులు బొడ్డు కళ్యాణరావు అధ్యక్షతన జరిగిన సదస్సులో ఎంఎస్‌సి కార్యదర్శి జెవి.ప్రభాకరరావు మాట్లాడారు. రాజ్యసభ సభ్యునిగా ఎన్నికైన తర్వాత వచ్చిన బాబూరావును ఘనంగా సత్కరించారు. ఎస్‌సి,ఎస్‌టి న్యాయవాదుల సంఘం అధ్యక్షులు వై. వసంతకుమారి, బీరా రత్నకుమారి, జి సత్యనారాయణ, ఆర్ సరస్వతి, కాంతారావు ,నాయుడు పాల్గొన్నారు.

'స్మార్ట్' నిధులతో ఆధునిక హంగులు

ప్రజాశక్తి -భీమునిపట్నం: వైసిపి ప్రభుత్వ హయాంలో విద్యారంగంలో విప్లవాత్మక మార్పులకు చేపట్టినట్లు ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు అన్నారు శుక్రవారం జివిఎంసి ఒకటో జోన్ పరిధిలో స్మార్ట్ సిటీ కార్పొరేషన్ నిధులు రూ 5.57 కోట్లతో పిఎన్ఎం ప్రాథమిక పాఠశాల, సిఎంఇ స్కూల్, కొండపేట, సంగివలస, ఎఎస్ఆర్ కాలనీప్రాథమిక పాఠశాలల్లో డిజిటల్ తరగతులు, ఇతర మౌలిక సదుపాయాలను ప్రారంభించారు. విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

4,184 మందికి ఇళ్ల రిజిస్ట్రేషన్ పట్టాల పంపిణీ

భీమునిపట్నం : జివిఎంసి 1,2,3,4 వార్డుల పరిధిలో 4,184 మంది జగనన్న ఇళ్లస్థలాల లబ్ధిదారులకు రిజిస్ట్రేషన్ పట్టాలను శుక్రవారం భీమిలిలో ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు పంపిణీ చేశారు. నియోజక వర్గంలో 35 వేల మందికి ఇళ్ల పట్టాలు ఇచ్చామన్నారు. డ్వాక్రామహిళలకు రుణమాఫీ, సున్నా వడ్డీ సాయాన్ని సకాలంలో అందించామన్నారు. కార్యక్రమాల్లో 3,4 వార్డుల కార్పొరేటర్లు గంటా అప్పలకొండ, దౌలపల్లి కొండబాబు, జెడ్‌సి కె కనకమహాలక్ష్మి, ఎఎంసి చైర్మన్ యలమంచిలి సూర్య నారాయణ, పిఎసిఎస్ అధ్యక్షులు అక్కరమాని రామునాయుడు, మాజీ కౌన్సిలర్ మైలపల్లి లక్ష్మణరావు, వైసిపి నేతలు ఎస్ కరుణాకరరెడ్డి, అల్లిపిల్లి నరసింగరావు పాల్గొన్నారు

డిజిటల్ తరగతి గదిని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి

పలు అభివృద్ధి పనులకు శ్రీకారం

శంకుస్థాపన చేస్తున్న కెకె.రాజు

ప్రజాశక్తి- సీతమ్మధార : జివిఎంసి 50వ వార్డులో కార్పొరేటర్ వావిలపల్లి ప్రసాద్ ఆధ్వర్యంలో రూ.1.06కోట్లతో పలు అభివృద్ధి పనులకు ఉత్తర నియోజకవర్గ వైసిపి సమన్వయకర్త కెకె.రాజు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపన నిర్వహించారు. మురళీనగర్ హరితపార్కులో రూ.18.90లక్షలతో నిర్మించిన ఓపెన్‌జిమ్, వాకింగ్ ట్రాక్‌ను ప్రారంభించారు. మురళీనగర్ భాస్కర్ గార్డెన్స్‌లో రూ.18.76లక్షలతో బిటి రోడ్డు నిర్మాణం, మాధవధారలో రూ.19.85 లక్షలతోనూ, వంశీనగర్‌లో రూ.39.10 లక్షలతో ప్రధాన కాలువ రక్షణగోడ, కాంక్రీట్ పనులనకు శంకుస్థాపన చేశారు.

44వ వార్డులో...

జివిఎంసి 44వ వార్డులో ఫ్లోర్‌లీడర్ బాణాల శ్రీనివాసరావు ఆధ్వర్యంలో రూ.19.52లక్షలతో ఎంటిసి పాలెంలో శ్మశానవాటిక పునరుద్ధరణ, ఎంటిసి పాలెం నుంచి ఎఎస్ఆర్ నగర్ వరకు రూ.42.28 లక్షలతో వరదనీటి కాలువ పునర్నిర్మాణ పనులకు కెకె.రాజు శంకుస్థాపన చేశారు.

కార్యక్రమంలో పేడాడ రమణికుమారి, భరణికాన రామారావు, బగాతి విజయ్, పప్పల సునీత, ఎం.లక్ష్మి, కృష్ణారావు, అమర్‌రెడ్డి, ఎవిఎన్. రాజు, నారాయణ స్వామి, రఘు, సోని, సరస, సుమతి, ప్రసన్నరెడ్డి,ఎంవి.రెడ్డి, రామ్మోహన్, సబ్బవరపు శ్రీను, రాంబాబు, సి.హెచ్ శ్రీను, టిఎన్. రెడ్డి, రమేష్, రామారావు, బొజ్జిరాజు, ఎఇఇ రమణమ్మ, 44వార్డు నాయకులు హబీబ్, సీతారాం, హీరా, షోఫియా, అక్తరి, బేగం, యాసిన్, గోపి, బషీర్, ప్రసాద్, మున్ని, సన్యాసిరావు, ముస్తఫా పాల్గొన్నారు.

ఈ సందర్భంగా కెకె.రాజు మాట్లాడుతూ, గత ప్రభుత్వాలు నిర్మించిన భవనాలను సచివాయాలకు వినియోగిస్తున్నారని మాజీ ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజు ఆరోపణలను ఖండించారు. ఒక్క ఉత్తరంలోనే రూ.435కోట్లతో అభివృద్ధి పనులు చేశామని, దీనిపై చర్చకు ఎక్కడి రమ్మన్నా సిద్ధమేనని సవాల్ విసిరారు.

గీతం విద్యార్థుల సత్తా

ప్రజాశక్తి- మధురవాడ : సైబర్ సెక్యూరిటీ నైపుణ్యాలపై ప్రముఖ ఐటి సంస్థ టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ (టిసిఎస్) దేశంలోని ఇంజనీరింగ్ విద్యార్థులకు జాతీయస్థాయిలో నిర్వహించిన హ్యాక్‌క్వెస్ట్–2024 పోటీలలో గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం విద్యార్థులు సత్తాను చాటారు. గీతం స్కూల్ ఆఫ్ టెక్నాలజీ ఇంజనీరింగ్ ఫైనలియర్ విద్యార్థి ఆవుల సత్య ద్వితీయ స్థానంలో నిలిచి రన్నరప్ ట్రోఫీతో పాటు రూ.1.2 లక్షల నగదు బహుమతిని అందుకోగా, మరో విద్యార్థి జి.సాయితేజ తృతీయ స్థానంలో నిలిచి రూ.70 వేల నగదు బహుమతిని అందుకున్నారు. అప్లికేషన్ సెక్యూరిటీ, నెట్‌వర్క్ సెక్యూరిటీ, డిజిటల్ ఫోరెన్సిక్స్, ఎథికల్ హ్యాకింగ్, మాల్‌వేర్ ఎనాలసిస్, రివర్స్ ఇంజనీరింగ్, జావా, పైథాన్ తదితర అంశాలపై తమకున్న పట్టును ప్రదర్శించి విజేతలుగా నిలిచిన గీతం విద్యార్థులు జాతీయ స్థాయిలో సత్తా చాటారనిగీతం కెరీర్ గైడెన్స్ డైరక్టర్ వంశీ కిరణ్ సోమయాజుల తెలిపారు. విద్యార్థుల ప్రతిభను కంప్యూటర్ సైన్స్ ఇంజనీరింగ్ విభాగాధిపతి డాక్టర్ ఆర్.శిరీష, డైరక్టర్ ప్రొఫెసర్ నాగేంద్రప్రసాద్ తదితరులు అభినందించారు.

సామాజిక సేవలతోనే సాధికారత

ప్రజాశక్తి -ములగాడ: మహిళలు నాయకత్వ లక్షణాలను అలవర్చుకొని, సామాజిక కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటే సాధికారిత సాధించవచ్చని సెయింట్ ఆన్స్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సిస్టర్ ప్రేమకుమారి అన్నారు. శుక్రవారం క్రాంతినగర్‌లో కాలేజీ ఎన్ఎస్ఎస్ యూనిట్ -1 ప్రత్యేక సేవా శిబిరాన్ని ప్రారంభించారు. అలాగే ఎన్ఎస్ఎస్ యూనిట్–2 ఆధ్వర్యంలో ప్రకాశ్‌నగర్‌లో కరస్పాండెంట్ సిస్టర్ గెసిల్లా. యూనిట్ -3 ఆధ్వర్యంలో త్రినాధపురంలో జూనియర్ కాలేజీ ప్రిన్సిపల్ సిస్టర్ జానీస్ ప్రత్యేకసేవా శిబిరాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, వ్యక్తిత్వ వికాసానికి, సమాజ ప్రగతికి సామాజిక కార్యక్రమాలు ఎంతో అవసరమన్నారు. ప్రోగ్రాం అధికారులు ఇపిఎస్. భాగ్యలక్ష్మి, వై అనసూయాదేవి, వి.అంజలీదేవి పాల్గొన్నారు. అనంతరం మహిళా దినోత్సవం సందర్భంగా సిస్టర్స్‌ను సత్కరించారు.

చీరల పంపిణీ

ప్రజాశక్తి -భీమునిపట్నం : స్థానిక కలిగొట్ల స్నిగ్ధశ్రీ బాల పేరంటాలు కార్యక్రమంలో భాగంగా స్నిగ్ధ శ్రీదేవి ఫౌండేషన్ ఆధ్వర్యంలో స్థానిక చిన్నబజారులోని వారి స్వగృహం వద్ద శుక్రవారం పేద మహిళలకు పెద్ద ఎత్తున చీరలు పంపిణీ చేశారు. అన్నదానం నిర్వహించారు. ఫౌండేషన్ చైర్మన్ కె శ్రీరామచంద్రమూర్తి, కుటుంబ సభ్యుల తో కలిసి విశాఖ ఉత్తర ఎమ్మెల్యే, మాజీ మంత్రి గంటా శ్రీనివాసరావు వీటిని అందజేశారు. కార్యక్రమంలో ఫౌండేషన్ ప్రతినిధులు, కుటుంబసభ్యులు కెఎస్ఎన్ మూర్తి, కె చంద్రశేఖర్, కెవి భానోజీరావు, కె శ్రీనివాసరావు పాల్గొన్నారు

ఏ స్థానంలోనైనా పోటీకి సిద్ధమే : శ్రీ భరత్



జన్మదిన వేడుకల్లో పాల్గొన్న శ్రీభరత్

ప్రజాశక్తి -ఆనందపురం: అధిష్టానం ఆదేశిస్తే జిల్లాలో ఏ స్థానంలోనైనా తాను పోటీకి సిద్ధమేనని తెలుగుదేశం పార్టీ విశాఖ పార్లమెంట్ ఇన్‌ఛార్జ్ ఎం.శ్రీభరత్ అన్నారు. శుక్రవారం మండలంలోని నీళ్లకుండీలు వద్ద తెలుగునాడు విద్యార్థి సమాఖ్య రాష్ట్ర అధికార ప్రతినిధి లెంక సురేష్ కుమారుడు జన్మదిన వేడుకలలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా శ్రీభరత్ మాట్లాడుతూ, విశాఖపట్నం ఎంపి టిక్కెట్ ఆశిస్తున్నానని, ఒకవేళ పార్టీ అధిష్టానం అసెంబ్లీ సీటు కేటాయించినా పోటీకి సిద్ధమన్నారు. కార్యక్రమంలో మండల టిడిపి అధ్యక్షులు బొద్దు శ్రీను, జిల్లా కార్యదర్శి గండ్రెడ్డి రమేష్, లెంక అప్పారావు, బలిరెడ్డి నాగేశ్వరరావు, నాగిరెడ్డి అప్పలరాజు పాల్గొన్నారు.

న్యాయం చేయాలని ఆసుపత్రి వద్ద ఆందోళన

ప్రజాశక్తి - ఆరిలోవ : ఆసుపత్రి వైద్యులు, సిబ్బంది నిర్లక్ష్యం కారణంగానే తన భర్త మృతి చెందారని అపోలో ఆసుపత్రి వద్ద బాధిత కుటుంబ సభ్యులు శుక్రవారం ఆందోళన చేపట్టారు. బాధితులు తెలిపిన వివరాలివి. విజయనగరం జిల్లా రామభద్రపురం, ఆరికతోట గ్రామానికి చెందిన మిత్తిపాటి కోటేశ్వర్రావు(62) అనారోగ్యంతో డిసెంబరు 19న ఆరిలోవ హెల్త్‌సిటీ, అపోలో ఆసుపత్రిలో చేరారు. డాక్టర్ సుమంత్ పర్యవేక్షణలో వైద్యం అందించారు. కడుపులో చేరిన నీటిని తొలగించి ఇంటికి పంపేశారు. మరుసటి రోజు నుంచి కడుపులో నొప్పి తీవ్రం కావడంతో మళ్లీ ఆసుపత్రిలో చేర్పించగా, రెండు నెలపాటు ఎంఐసియులో చికిత్స అందించారని, గతనెల 20న మృతి చెందారన్నారు. రెండు నెలలపాటు ఆసుపత్రిలో చేసిన వైద్యానికి డబ్బులు తీసుకోలేదన్నారు. వైద్యులు నిర్లక్ష్యం వల్లే కుటుంబపెద్దదిక్కును కోల్పోయామని, తమకు న్యాయం చేయాలని కోరారు.

నేటి నుంచి పంచకర్మ ఆయుర్వేద శిబిరం

ప్రజాశక్తి - సీతమ్మధార : దీర్ఘకాలిక రోగాలకు ఆయుర్వేద పంచకర్మ విధానం ద్వారా చికిత్స అందించేందుకు ఈనెల 9 నుంచి 11 వరకు కేరళ ఆయుర్వేద శిబిరం నిర్వహిస్తున్నట్టు వైద్యరాజ్ ఔషధాలయ మేనేజర్ దినుప్ తెలిపారు. ప్రముఖ కేరళ వైద్యులు డాక్టర్ కెఎం.ఉన్నికృష్ణన్ నాయర్ మూడు రోజుల పాటు ఈ కేంద్రంలో అందుబాటులో ఉంటారని, చర్మ వ్యాధులు, సైనసైటిస్, సొరియాసిస్, ఇఎన్‌టి సమస్యలు, హైపర్ టెన్షన్, కీళ్ల వ్యాధులు, నడుం నొప్పి, స్పాండిలైటిస్, మానసిక ఒత్తిడి, నిద్రలేమి, రుమాటిజం వంటి సమస్యలకు ఈ శిబిరంలో చికిత్స పొందవచ్చన్నారు. అపాయింట్‌మెంట్ కొరకు మురళీనగర్ శ్రీదేవి పార్క్ సమీపంలోని తమ కేంద్రంలోగానీ, 7675861446 , 0891-2568264 ఫోన్ నెంబర్లకు సంప్రదించాలన్నారు.

92 మంది సచివాలయ కార్యదర్శులకు షోకాజ్

ప్రజాశక్తి -సీతమ్మధార : సర్వే, ఇతరత్రా ప్రభుత్వ కార్యక్రమాల పట్ల నిర్లక్ష్యం వహిస్తున్నారని 92 మంది సచివాలయ కార్యదర్శులకు జివిఎంసి ఐదవ జోన్ కమిషనర్ ఆర్‌జివి.కృష్ణ షోకాజ్ నోటీసులు జారీ చేశారు. ఈనెల 20లోగా వివరణ ఇవ్వాలని, లేకుంటే మార్చి నెల వేతనాలను నిలుపుదల చేస్తామని నోటీసుల్లో పేర్కొన్నారు. దీనిపై సచివాలయ సిబ్బంది ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. జెడ్‌సి తీరుపై కలెక్టరకు ఫిర్యాదు చేసే యోచనలో ఉన్నట్లు తెలుస్తోంది.

ఘనంగా దామెర్ల రామారావు జయంతి

ప్రజాశక్తి -ములగాడ: ప్రముఖ భారతీయ చిత్రకారులు దామెర్ల రామారావు జయంతిని మల్కాపురం శాఖా గ్రంథాలయంలో చిత్రకళా పరిషత్ ఆధ్వర్యంలో నిర్వహించారు. దామెర్ల చిత్రపటానికి ఎస్. చలపతిరావు పూలమాల వేసి నివాళులర్పించారు. చిత్రకారులు శ్రీనివాసమనోహర్, గ్రంథాలయాధికారి వి.అజయ్‌కుమార్ పాల్గొన్నారు.

టిడిపి నేతల ప్రచారం

ప్రజాశక్తి -నక్కపల్లి: టిడిపి - జనసేన ఉమ్మడి పార్టీ అధికారంలోకి వస్తే అన్ని వర్గాల ప్రజలకు లబ్ధి చేకూరుతుందని తెలుగుదేశం పార్టీ మండల శాఖ అధ్యక్షులు కొప్పిశెట్టి వెంకటేష్ అన్నారు. మండలంలోని శుక్రవారం రమణయ్యపేట, జి.జగన్నాథ పురం గ్రామాల్లో ఉపాధి హామీ పథకం కూలీలకు సూపర్ సిక్స్ పథకాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో నియోజక వర్గ లీగల్ సెల్ అధ్యక్షులు కర్రి ఆంజనేయులు, నాయకులు వైబోయిన రమణ,గంట్యాడ రమేష్ , చిట్టిబాబు, శ్రీను, శ్రీనివాసరావు, రమణ, రాజా తదితరులు పాల్గొన్నారు .

ప్రచారం చేపడుతున్న నాయకులు

సమాధుల స్థలాన్ని కాపాడండి

ప్రజాశక్తి-నర్సీపట్నం టౌన్: పట్టణ నడిబొడ్డులో ఉన్న అల్లూరి పోరాటానికి గుర్తుగా ఉన్న బ్రిటిష్ సైనిక అధికారుల సమాధుల స్థలాన్ని అన్యాక్రాంతం కాకుండా కాపాడాలని సామాజిక కార్యకర్త, పన్ను చెల్లింపుదారుల సంక్షేమ సంఘం కార్యదర్శి కె.శివనారాయణ రాజు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు ప్రకటన విడుదల చేశారు. కోట్లాది రూపాయలు విలువ చేసే స్థలాన్ని ఇప్పటికే కొంతమంది ఆక్రమించుకున్నారని, మరి కొంతమంది ఆక్రమణదారులు ప్రయత్నాలు ముమ్మరం చేశారన్నారు. దీనిపై రెవెన్యూ, మున్సిపల్ అధికారులు స్పందించి ఈ స్థలం అన్యాక్రాంతం కాకుండా పరిరక్షించాలని ఆయన కోరారు. ఈ స్థలాన్ని అల్లూరి స్మృతి వనంగా తీర్చిదిద్ది, చుట్టూ ప్రహరీ నిర్మించాలన్నారు.

వ్యక్తి మృతదేహం లభ్యం

ప్రజాశక్తి-యస్.రాయవరం: మండలంలోని రేవు పోలవరం సముద్ర తీరంలో ఓ వ్యక్తి మృతి చెందినట్లు స్థానిక ఎస్ ఐ.విభీషణరావు తెలిపారు. శుక్రవారం మధ్యాహ్నం తీరం ఒడ్డున గుర్తు తెలియని మృతదేహం ఉన్నట్లు ఇచ్చిన సమాచారం మేరకు పరిశీలించామన్నారు. మృతుడు పాయకరావుపేట గ్రామానికి చెందిన నూకల మనీష్ (29) గా గుర్తించామన్నారు. బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి ధర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టమ్ నిమిత్తం నక్కపల్లి ప్రభుత్వాసుపత్రికి తరలించినట్లు తెలిపారు.

నెల రోజుల్లో అసంపూర్తి టిడ్కో గృహాల నిర్మాణం

-ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్

ప్రజాశక్తి-నర్సీపట్నం టౌన్: టీడీపీ హయాంలో టిడ్కో ఇళ్లు పూర్తి కాలేదని, తాము అధికారంలోకి వచ్చిన వెంటనే పూర్తి చేసినట్లు నర్సీపట్నం ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ అన్నారు. ఇంకా పూర్తి కావాల్సిన ఇళ్లను నెల రోజుల్లో చేసి వాటిని కూడా అందజేస్తామన్నారు. నర్సీపట్నం మున్సిపాలిటీ బలిఘట్టం సమీపంలోని నిర్మించిన 300 చదరపు అడుగుల 356 ఇళ్లను శుక్రవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, టిడ్కో గృహాలను 2019 మే నెలలో పూర్తి చేయాల్సి ఉందని, టీడీపీ ప్రభుత్వం నిర్లక్ష్యం చేసిందని విమర్శించారు.365 చదరపు గజాలకు సంబంధించి 336 ప్లాట్లకు కేవలం 180 మాత్రమే శ్లాబ్ మాత్రమే చేశారన్నారు. అలాగే 430 చదరపు గజాలకు సంబంధించి 1104 ప్లాట్లకు గాను 750కు మాత్రమే శ్లాబ్ వేశారన్నారు. ఈ గృహాలను వైసిపి ప్రభుత్వంలో పూర్తి చేయడం జరిగిందన్నారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి టిడ్కో గృహాల నిర్మాణాలకు రూ.91కోట్లు మంజూరు చేశారన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ బోడపాటి సుబ్బలక్ష్మీ వైస్ చైర్మన్ కోనేటి రామకృష్ణ, మున్సిపల్ కమిషనర్ రవిబాబు, వైసిపి కౌన్సిలర్లు, నాయకులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే గణేష్

'కక్షపూరితంగానే గృహాల్లో సోదాలు'

ప్రజాశక్తి-గొలుగొండ: రాజకీయ కక్ష సాధింపుల్లో భాగంగా జనసేన పార్టీ నేతలు, సిబ్బంది నివాసిత ప్రాంతాలపై పోలీసు సోదాలు చేస్తున్నారని జనసేన పార్టీ నర్సీపట్నం నియోజకవర్గ ఇన్‌చార్జ్ రాజాన వీరసూర్యచంద్ర ఆరోపించారు. శుక్రవారం గొలుగొండలో పార్టీ నాయకులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మంగళగిరి ప్రాంతంలో జనసేన పార్టీ కోసం పని చేస్తున్న సిబ్బంది ఉంటున్న అపార్టుమెంట్లలోకి రాత్రి సమయంలో పోలీసులు ప్రవేశించి సోదాలు చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. పార్టీ సిబ్బంది గదుల్లోకి వెళ్లి వారిని భయభ్రాంతులకు గురి చేయడం సరికాదన్నారు. ఈ కార్యక్రమంలో ఉత్తరాంధ్ర ప్రచార కమిటీ సభ్యులు అద్దేపల్లి గణేష్, నాయకులు దొరబాబు, నారాయణ రావు, రాజా పాల్గొన్నారు.

ఆయుర్వేద వైద్యశిబిరం

ప్రజాశక్తి-యస్.రాయవరం: మహాశివరాత్రి పర్వ దినాన్ని పురస్కరించుకుని పెదగుమ్ములూరు శివాలయం వద్ద ఉచిత వైద్యశిబిరం నిర్వహించినట్లు ఆయుర్వేద వైద్యాధికారిణి సుజాత తెలిపారు. శివాలయంకు వచ్చిన భక్తులకు పరీక్షలు చేసి అవసరమైన మందులు ఉచితంగా అందించామన్నారు.కొరుప్రోలు ఆయుష్ ఆసుపత్రిలో ఉచిత ఆయిల్ థెరపిపై ప్రజలకు అవగాహన కల్పించామన్నారు. ఈ కార్యక్రమంలో ఆయుష్ సిబ్బంది రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

రైల్వే రిజర్వేషన్ కౌంటర్‌ను తెరిపించాలి

-ఎంపీ సత్యవతికి సిపిఎం వినతి

ప్రజాశక్తి-యస్.రాయవరం: మండలంలో చిన్నగుమ్ములూరు గ్రామానికి సమీపంలోని నర్సీపట్నం రైల్వేస్టేషన్‌లో రైల్వే రిజర్వేషన్ కౌంటర్‌ను పున్ణప్రారంబించాలని పార్లమెంటు సభ్యులు బి.వి.సత్యవతమ్మకి వినతి పత్రం ఇచ్చినట్లు సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎం.అప్పలరాజు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన శుక్రవారం మాట్లాడుతూ, రైల్వేస్టేషన్‌లో రిజర్వేషన్ కౌంటర్ నిలుపుదల చేయడంతో ఈ ప్రాంత ప్రజలు తీవ్రంగా ఇబ్బంది పడుతున్నారన్నారు.రైల్వే రిజర్వేషన్ చేసుకునేందుకు 20 కిలోమీటర్ల దూరంలోని తుని, ఎలమంచిలి వెళ్లి రిజర్వేషన్ చేసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడుతుందని తెలిపారు.రాబోయే కాలంలో పెద్ద పారిశ్రామిక ప్రాంతంగా అభివృద్ధి కాబోతున్న సమయంలో ఇక్కడ రిజర్వేషన్ కౌంటర్‌ను మూసి వేయడం సరికాదన్నారు.ప్రయాణికుల అవసరాలను, ఇబ్బందులను పరిగణనలోకి తీసుకుని రిజర్వేషన్ కౌంటర్‌ను వెంటనే పున్ణప్రారంబించాలని కోరారు. స్పందించిన ఎం.పి ఈ సమస్యపై సంబంధిత అధికారులతో మాట్లాడి రైల్వే రిజర్వేషన్ కౌంటర్ పున్ణప్రారంబించే విధంగా కృషి చేస్తామని హామీ ఇచ్చారని అప్పలరాజు తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు జీ.శ్రీరామ్, ఎ.రాజు, నాయకులు సి.హెచ్ శివాజీలు పాల్గొన్నారు.

వినతిపత్రం ఇస్తున్న అప్పలరాజు, తదితరులు

బలహీనవర్గాలకు అండగా న్యాయస్థానాలు

ప్రజాశక్తి-నర్సీపట్నం టౌన్: భారత రాజ్యాంగం కల్పించిన న్యాయస్థానాల ద్వారా బడుగు బలహీన వర్గాలకు న్యాయం జరుగుతుందని విదసం ఐక్యవేదిక రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ బూసి వెంకటరావు అన్నారు. నర్సీపట్నం ఎన్జీవో హోంలో శుక్రవారం వివిధ దళిత సంఘాల ఐక్యవేదిక జోనల్ స్థాయి ముఖ్య నాయకుల సమావేశం వడ్లమూరి దేవుడు అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా వెంకటరావు మాట్లాడుతూ, న్యాయస్థానాలతో న్యాయం జరగకపోతే ఎంతోమంది అమాయకులు జైల్లో శిక్ష అనుభవించే వారన్నారు. ప్రొఫెసర్ సాయిబాబాను అన్యాయంగా అరెస్టు చేస్తే కోర్టులో న్యాయం జరగడంతో మంచి వ్యక్తి బయటకు వచ్చారన్నారు. కోడి కత్తి కేసులో జనపల్లి శ్రీనివాసరావును బయటకు తీసుకురావడానికి విద సం ఐక్యవేదిక ఎంతో కృషి చేసిందని ఆయన గుర్తు చేశారు. నర్సీపట్నంలో అంబేద్కర్ సామాజిక భవనానికి అందరూ వంతు సహకారం అందించాలని నాయకులు అధికారులు తమ సహకారం అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షులు గోవిందు, చీఫ్ అడ్వైజర్ ఎల్లాజీ, బీఎస్పీ ఇన్‌చార్జ్ బొట్ట నాగరాజు. చిట్టయ్య మాస్టారు., కొండబాబు. ఆదివాసి సంఘం నాయకులు పాల్గొన్నారు

మాట్లాడుతున్న విదసం కన్వీనర్ వెంకట్రావు

ప్రశాంత ఎన్నికలకు సహకరించాలి

ప్రజాశక్తి-గొలుగొండ: ప్రశాంత ఎన్నికలకు సహకరించాలని గొలుగొండ ఎస్సై కృష్ణారావు కోరారు. శుక్రవారం కొత్తమల్లంపేట గ్రామస్థులతో సమావేశమై మాట్లాడారు. అన్ని పార్టీల నాయకులు సమన్వయం పాటించాలన్నారు. ఒకరినొకరు దూషణలు చేసుకోరాదన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామస్థులు పాల్గొన్నారు.

మహిళా సాధికారతకు కృషి

ప్రజాశక్తి -కొత్తకోట: మహిళా సాధికారత దిశగా తెలుగుదేశం పార్టీ అధినేత నారా చంద్రబాబు నాయు డు, జనసేన పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ మరో కీలక ముందడుగు వేశారని చోడవ రం నియోజకవర్గం టిడిపి అధ్యక్షురాలు కోట నీలవేణి చెప్పారు. కొత్తకోట స్వగృహం లో శుక్రవారం స్థానిక విలేకరులతో ఆమె మాట్లాడుతూ, ఆడబిడ్డల చదువుకు నూతన పథకాన్ని తీసుకు వచ్చారన్నారు. విద్యను అందించడంతో పాటు ఉపాది అవకాశాలు కల్పించడం ఈ పథకం ప్రధాన లక్ష్యమన్నారు. అర్హత ఉన్న మహిళలందరూ దేశంలో ఎక్కడైనా తమకు నచ్చిన ప్రొఫెషనల్ కోర్సులను అభ్యసించవచ్చున్నారు.

ఈశ్వరమ్మకు అవార్డు

ప్రజాశక్తి -చీడికాడ: ప్రపంచ మహిళా దినోత్సవం సందర్భంగా మండలం చిన్న గోగాడ క్లస్టర్ 1 అంగనవాడి సూపర్వైజర్ ఏలుసూరి ఈశ్వరమ్మ శుక్రవారం అనకాపల్లిలో పార్లమెంట్ సభ్యులు బిశెట్టి సత్యవతి చేతుల మీదుగా ఉత్తమ అవార్డు అందుకున్నారు. సూపర్‌వైజర్‌కు మాడుగుల పిఎ అభినందనలు తెలియజేశారు.

అవార్డు అందుకుంటున్న సూపర్‌వైజర్

ప్రకటన

మహారాజశ్రీ ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి, విజయనగరం, విజయనగరం జిల్లా వారి కోర్టులో

O.S. No. 84/2023

Between:

మన్నె సహస్రా చౌదరి, మైనర్ అయినందున గార్డియన్‌గా తల్లి: శ్రీమతి మన్నె అనూషా చౌదరి **-వాది**

AND

మన్నె సత్యనారాయణ మరియు 4గురు ఇతరులు **-ప్రతివాదులు**

ప్రతివాది నెం.5:

మేదరమెట్ల లవీన్‌బాబు, తండ్రి: లేటు సత్యనారాయణ, హిందువు, పురుషుడు, వయస్సు 38 సం॥లు, నివాసం: 3వ ఫ్లోర్, ఫ్లాట్ నెం. యఫ్-2, బి.వి.కె.కాలేజీ దగ్గర, విశాలాక్షి నగర్, విశాఖపట్నం, విశాఖపట్నం అర్బన్, విశాఖపట్నం జిల్లా.

పై నెంబరు దావా గ్రంథమునందు 5వ ప్రతివాదికి నోటీసు అమలు కొరకు **ది. 27-03-2024వ తేదీకి వాయిదా అయివున్నది.** కావున ఆరోజున మీరు స్వయంగా గానీ, లేదా మీ తరపున న్యాయవాది గారి ద్వారా గానీ **ఉదయం గం॥ 10.30 ని॥లకు** పై కోర్టు వారి ఎదుట హాజరు కావలెను. లేనియెడల మీకు పరోక్షమున తీర్మానించబడును.

(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)

శ్రీ యం.త్రినాధరావు
శ్రీ కూరపాటి పృథ్వీరాజ్
శ్రీ గోళ్ళ గోవింద శ్రీ చరణ్
అడ్వకేట్స్, ఏలూరు
సెల్: 9247163349, 8019826216

ప్రకటన

మహారాజశ్రీ ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి, విజయనగరం, విజయనగరం జిల్లా వారి కోర్టులో

I.A. No. 632/2023 in O.S. No. 84/2023

Between:

మన్నె సహస్రా చౌదరి, మైనర్ అయినందున గార్డియన్‌గా తల్లి: శ్రీమతి మన్నె అనూషా చౌదరి **-పిటీషనర్/వాది**

AND

మన్నె సత్యనారాయణ మరియు 4గురు ఇతరులు **-రెస్పాండెంట్స్/ ప్రతివాదులు**

రెస్పాండెంట్/ ప్రతివాది నెం.5:

మేదరమెట్ల లవీన్‌బాబు, తండ్రి: లేటు సత్యనారాయణ, హిందువు, పురుషుడు, వయస్సు 38 సం॥లు, నివాసం: 3వ ఫ్లోర్, ఫ్లాట్ నెం. యఫ్-2, బి.వి.కె.కాలేజీ దగ్గర, విశాలాక్షి నగర్, విశాఖపట్నం, విశాఖపట్నం అర్బన్, విశాఖపట్నం జిల్లా.

పై నెంబరు దావా గ్రంథమునందు I.A. లో కూడా 5వ రెస్పాండెంట్/ ప్రతివాదికి నోటీసు అమలు కొరకు **ది. 27-03-2024వ తేదీకి వాయిదా అయివున్నది.** కావున ఆరోజున మీరు స్వయంగా గానీ, లేదా మీ తరపున న్యాయవాది గారి ద్వారా గానీ **ఉదయం గం॥ 10.30 ని॥లకు** పై కోర్టు వారి ఎదుట హాజరు కావలెను. లేనియెడల మీకు పరోక్షమున తీర్మానించబడును.

(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)

శ్రీ యం.త్రినాధరావు
శ్రీ కూరపాటి పృథ్వీరాజ్
శ్రీ గోళ్ళ గోవింద శ్రీ చరణ్
అడ్వకేట్స్, ఏలూరు
సెల్: 9247163349, 8019826216

IN THE HONOURABLE COURT OF THE 1ST ADDITIONAL DIST CIVIL JUDGE AT SRIKAKULAM
E.P.122 /2023 in A.A. No.672/2021

Between:
M/s. Shriram Transport Finance Company Limited, Represented by Recovery Executive & G.P.A. Holder, Vishakapatnam, rept by its DHr Bonu Venkata Ravisankar. ... DHr

And:
Tillangi Prakasa Rao & another ...Judgment Debtors

NOTICE

To,
1) Tillangi Prakasa Rao,
S/o. Mukhalingam, Hindu,
Aged 45 years,
Sarubujjili Vill & Md, Presently residing at D.No. 56-2-89,
Pharmacity Colony,
E- MarripalemVill & Post,
GajuwakaMandal,
VishakapatnamDist

Please take notice that the petitioner/D.Hr filed above EP against the 1st Jdr U/O 21 R 54 CPC, and the above matter is stands posted to **28-03-2024** for your appearance, and you are to appear on aforesaid date before the Honourable 1st Additional District Judge, Srikakulam at about **10.30 A.M** in person or through pleader, otherwise the above matter will decide against you. Hence this Notice.

S.SAIKISHORE
Advocate for DHr
Srikakulam-532001,
Cell: 9493659846

Srikakulam
Dt: 8-3-2024

IN THE HONOURABLE COURT OF THE 1ST ADDITIONAL DIST CIVIL JUDGE AT SRIKAKULAM
E.P. 127 /2023 in A.A.No. 671/2021

Between:
M/S Shriram Transport Finance Company Limited, Represented by Recovery Executive & G.P.A. Holder, Vishakapatnam, rept by its DHr Bonu Venkata Ravisankar. ... DHr

And:
Tillangi Prakasa Rao & another ...Judgment Debtors

NOTICE

To
1) Tillangi Prakasa Rao,
S/o. Mukhalingam, Hindu,
Aged 45 years, Sarubujjili Vill & Md, Presently residing at D.No. 56-2-89,
Pharmacity Colony,
E- MarripalemVill & Post,
GajuwakaMandal,
VishakapatnamDist

Please take notice that the petitioner/D.Hr filed above EP against the 1st Jdr U/O 21 R 54 CPC, and the above matter is stands posted to **28-03-2024** for your appearance, and you are to appear on afore said date before the Honourable 1st Additional District Judge, Srikakulam at about **10.30 A.M** in person or through pleader, otherwise the above matter will decide against you. Hence this Notice.

S.SAIKISHORE
Advocate for DHr
Srikakulam-532001,
Cell: 9493659846

Srikakulam
Dt: 8-3-2024

IN THE HONOURABLE COURT OF THE JUDGE : CHIEF METROPOLITAN MAGISTRATE AT VISAKHAPATNAM
C.C.No.4649/2022

Between :
Patoju Ravi ... Petitioner / Complainant

And :
Kundrapu Ganga Bhavani ... Respondent / Accused

To
Respondent
Kundrapu Ganga Bhavani,
W/o.Kundrapu Narasimheswara Rao,
D.No.23-10-37, Simhagiri Colony,
Gajuwaka, Visakhapatnam District,
Andhra Pradesh State.

NOTICE

Please, take notice that the above named Petitioner filed the case against you for Under Section 138 of N.I.Act and the same was posted to **03-04-2024** for your appearance either in person by an authorized representative at **10.30 A.M.** before the Honourable Court of the Chief Metropolitan Magistrate at Visakhapatnam, Andhra Pradesh State, failing which the matter will be decided in your absence.
(As per the order of the Honourable Court of the CMM at Visakhapatnam)

POLINAIDU VUDAMALA
Advocate
Block No.V, Flat No.5RA
J.K. Modern Homes,
Anthony Nagar,
Visakhapatnam-530 002.
Cell No.9966631486

పలుచోట్ల మహిళా దినోత్సవం

కుట్టుశిక్షణ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వెలగపూడి, మంగవేణి

ప్రపంచ మహిళా దినోత్సవాన్ని పలుచోట్ల ఘనంగా నిర్వహించారు. పురుషులతో సమానంగా అన్నింటా రాణిస్తున్న మహిళల సేవలను కొనియాడారు. వివిధ రంగాల్లో విశేషంగా రాణించిన మహిళామణులను సత్కరించారు.

(ప్రజాశక్తి విలేకర్ల యంత్రాంగం)

ఎంవిపి.కాలనీ : ఎన్ఎస్‌టిఎల్‌లోని మోహపాత్ర మానసి అడిటోరియంలో 'ఇన్‌స్పైర్ ఇన్‌క్లూజన్' థీమ్‌తో మహిళా దినోత్సవ వేడుకలు జరిగాయి. ముఖ్య అతిథిగా నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ వైరాలజీ పూణె మాజీ డైరెక్టర్, వెల్లూరు క్రిస్టియన్ మెడికల్ కాలేజ్ ప్రొఫెసర్ డాక్టర్ ప్రియా అబ్రహం హాజరయ్యారు. కార్యక్రమంలో నేవల్ సిస్టమ్స్ అండ్ మెటీరియల్స్ క్లస్టర్ ప్రథమ మహిళ వై.లక్ష్మి, ఎన్ఎస్‌టిఎల్ ప్రథమ మహిళ ఇలీన్ దీనా అబ్రహం, డైరెక్టర్ డాక్టర్ అబ్రహం వర్గీస్, సైంటిస్ట్ డాక్టర్ బి.మమత పాల్గొన్నారు.

కుట్టు శిక్షణ కేంద్రం ప్రారంభం

ఫిషర్‌మ్యాన్ కాలనీ, అప్పుఘర్‌లో ఉచిత కుట్టు శిక్షణ కేంద్రాన్ని తూర్పు నియోజకవర్గం ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు, 18వ వార్డు కార్పొరేటర్ గొలగాని మంగవేణి ప్రారంభించారు. ఈ కుట్టు శిక్షణ కేంద్రాన్ని లయన్స్ క్లబ్ ఆఫ్ విశాఖపట్నం, స్వయంకృషి వెల్ఫేర్ సొసైటీ సంయుక్తంగా నిర్వహించనున్నాయి. కార్యక్రమంలో లయన్ 2వ వైస్ డిస్ట్రిక్ట్ గవర్నర్ లయన్ డి.సూర్యప్రకాష్, రీజియన్ ఛైర్మన్ లయన్ యన్.సుధాకరరావు, జోన్ ఛైర్మన్ లయన్ దుర్గా ఆనంద్, ప్రెసిడెంట్ లయన్ ఎంఎం.మహేష్, సెక్రటరీ లయన్ వివియన్.నాయుడు పాల్గొన్నారు. స్వయంకృషి వెల్ఫేర్ సొసైటీ సభ్యులు, ధనలక్ష్మి తదితరులు మహిళా దినోత్సవం సందర్భంగా కార్పొరేటర్ జి.మంగవేణిని సన్మానించారు.

విశాఖ కలెక్టరేట్ : జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద నిర్వహించిన కార్యక్రమంలో ది ఇండియన్ మహిళా ఫౌండేషన్ ప్రతినిధి జివిఎల్.పద్మ, హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మంత్రి శ్యాం ప్రసాద్ మాట్లాడారు. మహిళా చట్టాలను పాలకులు పూర్తి స్థాయిలో అమలు చేయడం లేదన్నారు. బీచ్ రోడ్డులోగల వైఎంసిఎ వద్ద పాపా బాలిక హోంలో సహజ యోగా మెడిటేషన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. నేటి యాంత్రిక జీవనంలో మహిళలు అనేక ఒత్తిళ్లకు గురవుతున్నారని సహజ యోగా ట్రస్ట్ రాష్ట్ర ప్రతినిధి పద్మావతి సింహాద్రి అన్నారు. జాతీయ ట్రస్ట్ ట్రైనింగ్ కో-ఆర్డినేటర్ సుభాషిణి, సహజ యోగా ట్రస్ట్ ఎపి కో ఆర్డినేటర్ రామకృష్ణ పాల్గొన్నారు.

మధురవాడ: గీతం వర్సిటీ మహిళా సాధికారిక విభాగం ఆధ్వర్యంలో మహిళా దినోత్సవాన్ని నిర్వహించారు. మహిళలు, విద్యార్థులు, అధ్యాపకులు హెల్త్ వాక్‌లో పాల్గొన్నారు. మహిళా సాధికారకతపై వివిధ రంగాల నిపుణులతో చర్చావేదిక, మహిళల చేతివృత్తుల ప్రదర్శన నిర్వహించారు. విద్యార్థినుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. విజేతలకు జిమ్‌సర్ ప్రో వైస్‌ఛాన్సలర్ డాక్టర్ బి.గీతాంజలి బహుమతులు అందజేశారు. గీతం మహిళా సాధికారిక విభాగం ఛైర్‌పర్సన్ డాక్టర్ వి.బి.శ్రీవిద్య, డాక్టర్ బాలాకుమార్ పాల్గొన్నారు.

పెందుర్తి : విశాఖ నరవలోని విశాఖ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇంజినీరింగ్ కాలేజీ ఉమెన్స్ గ్రీవెన్స్ సెల్ ఆధ్వర్యంలో మహిళా దినోత్సవంలో స్టీల్‌ప్లాంట్ జనరల్ మేనేజర్ భాను పాల్గొన్నారు. కాలేజీ ఛైర్మన్ సత్యనారాయణ, ప్రిన్సిపల్స్ శ్రీధర్ పట్నాయక్, ప్రసాద్, దయానాపాల్గొన్నారు.

పద్మనాభం: మండలంలోని గంధవరంలో మహిళా దినోత్సవ వేడుకలు నిర్వహించారు. నాలుగోత నాగమణి పాల్గొన్నారు.

విశాఖపట్నం : పెద జాలరిపేట అర్బన్ హెల్త్ ట్రైనింగ్ సెంటర్‌లో మహిళా దినోత్సవంలో యుపిహెచ్‌టిసి వైద్యాధికారి డాక్టర్ ఎంవివి. మురళీమోహన్, గీతం కాలేజ్ ఆఫ్ నర్సింగ్ విద్యార్థులు 40 మంది పాల్గొన్నారు.

వేపగుంట: నాయుడు తోటలోని శంకర్ ఫౌండేషన్ కంటి ఆసుపత్రిలో మహిళా దినోత్సవ వేడుకలను ఫౌండేషన్ ఎగ్జిక్యూటివ్ ట్రస్టీలు ఆత్మకూరి కృష్ణకుమార్, విజయ్‌కుమార్, జనరల్ మేనేజర్ కె.రాధాకృష్ణన్, జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈసందర్భంగా మహిళా వైద్యులు నస్రిన్, శిరీష, సుపర్ణ , లక్ష్మి , సీత, ఇతర మహిళా ఉద్యోగులను సత్కరించారు హెచ్ఆర్ .మేనేజర్ శివప్రసాద్, డిప్యూటీ జనరల్ మేనేజర్ (పిఆర్) కె.బంగారురాజు పాల్గొన్నారు.

సీతమ్మధార: మిలీనియం సాఫ్ట్‌వేర్ సొల్యూషన్స్ ద్వారకానగర్ బ్రాంచ్‌లో మహిళా దినోత్సవంలో విశాఖ మహిళా ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ అరుణ పద్మ పాల్గొని మహిళా సాధికారితపై మాట్లాడారు. సెంట్రల్ మేనేజర్ వరద రవికుమార్ సిబ్బంది పాల్గొన్నారు.

గోపాలపట్నం : మహిళా దినోత్సవం సందర్భంగా 92వ వార్డు కార్యాలయంలో జివిఎంసి కో ఆప్షన్ సభ్యుడు బెహరా భాస్కరరావు ఆధర్యంలో మహిళా పారిశుధ్య కార్మికులను సత్కరించి చీరలు అందజేశారు. ఔట్ సోర్సింగ్ సూపర్వైజర్ దమ్ము శ్రీనివాసరావు తల్లి దమ్ము సత్యవతిని సన్మానించారు. ఎనిమిదోజోన్ మెడికల్ ఆఫీసర్ కృష్ణంరాజు, శానిటేషన్ సూపర్‌వైజర్ రమణ, ఇన్‌స్పెక్టర్లు గోపి, సన్యాసిరావు, బుచ్చిబాబు పాల్గొన్నారు.

అనందపురం: వేములవలస కూడలిలోని ఆర్‌ఎంపి ఉత్తరాంధ్ర జోనల్ కార్యాలయంలో ఆర్‌ఎంపి మహిళా సంఘం జోనల్‌కార్యదర్శి ఎన్. సుగుణేశ్వరి ఆధ్వర్యంలో మహిళా దినోత్సవం నిర్వహించారు

ఉత్తరాంధ్ర సామాజిక గ్రామీణ వైద్యుల సంఘం అధ్యక్షుడు జంగం జోషి. అవంతి కంప్యూటర్స్ డైరెక్టర్ కోన ప్రకాష్ పాల్గొని కేక్ కట్ చేసి మహిళలకు శుభాకాంక్షలు తెలిపారు. సంఘం సభ్యులు భవాని, అను, కళ, అన్నపూర్ణ, రేవతి, విజయలక్ష్మి, సీతారత్నం మేఘన, గయా రాధిక పాల్గొన్నారు

ఆరిలోవ : ఆరిలోవ హెల్త్ సిటీ అపోలో ఆసుపత్రిలో మహిళా దినోత్సవాన్ని ఫోక్సో న్యాయమూర్తి ఆనంది, డాక్టర్ సతీష్ ప్రభ జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. కార్యక్రమంలో విశాఖ వ్యాలీ స్కూల్ ప్రిన్సిపాల్ ఈశ్వరి ప్రభాకర్, జిల్లా స్పోర్ట్స్ ఆఫీసర్ గోలైట్ రోడ్రిక్స్, రెడ్ ఎఫ్ఎం షర్మిల, వైభవ్ జ్యూవెలరీస్ సిఎండి మల్లికా రత్నకుమారి, ఐరన్ లేడీ అవార్డు గ్రహీత షహనాజ్, నారీ శక్తి అవార్డు గ్రహీత ప్రసన్న శ్రీ, జిటో ప్రెసిడెంట్ ప్రసన్న బెయిడ్, యు వైజాగ్ ఛైర్మన్ శిల్పాంజలి దంతు పాల్గొన్నారు.

అనకాపల్లి : మహిళలు అన్ని రంగాల్లో ముందుకు రావాలని, దేశాభివృద్ధిలో తమదైన పాత్ర పోషించాలని స్థానిక ఎంపీ డాక్టర్ బివి సత్యవతి అన్నారు. స్థానిక సత్యలక్ష్మి గ్రాండ్ ఫంక్షన్ హాల్‌లో శుక్రవారం మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ప్రాజెక్ట్ డైరెక్టర్ కె అనంతలక్ష్మి ఆధ్వర్యంలో జరిగిన అంతర్జాతీయ మహిళా దినోత్సవంలో ఎంపీ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఐసిడిఎస్ ప్రాజెక్టులో ఉత్తమ సిబ్బందికి అవార్డులు అందజేశారు. అనంతరం జెడ్‌పి వైస్ చైర్‌పర్సన్ భీశెట్టి వరహ సత్యవతితో పాటు పలువురిని సత్కరించారు. కార్యక్రమంలో ఎంపిపి గొర్లి సూరిబాబు, కార్పొరేటర్లు లక్ష్మి సౌజన్య, కొణతాల నీలిమ భాస్కర్, జడ్పిటిసి బూడి అనురాధ, ఆర్జెడి చిన్మయి దేవి, ఏఎస్ఐ మణి కుమారి, ఐసిడిఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

స్థానిక ఏఎంఏఎల్ కళాశాలలో జరిగిన మహిళా దినోత్సవంలో అనకాపల్లి ట్రైనీ డిఎస్‌పి జి.భవ్యారెడ్డి పాల్గొని మాట్లాడారు. కళాశాలలో పనిచేస్తున్న మహిళలకు ఆటలు పోటీలను నిర్వహించి బహుమతులను అందచేశారు. కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ కెవిఎస్. మహేశ్వరరావు, కరెస్పాండెంట్ దాడి శ్రీనివాసరావు, అనురాధ పాల్గొన్నారు.సిద్దార్థ సోషల్ సర్వీస్ అండ్ కల్చ రల్ అసోసియేషన్ అధ్యక్షులు బల్లా నాగభూషణం ఆధ్వర్యాన స్థానిక సబ్ జైల్‌లో మహిళా ఖైదీలకు 'మహిళలు.. కరుణకు ప్రతి రూపాలు' అన్న అంశంపై వ్యాసరచన పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. సబ్ జైల్ సూపరింటెండెంట్ వై.గణేష్‌రెడ్డి పాల్గొన్నారు.

పరవాడ : పరవాడ వాసవి క్లబ్ వనిత ఆధ్వర్యంలో నిర్వహించిన మహిళ దినోత్సవానికి ఎంపిపి పైల వెంకట పద్మలక్ష్మీ హాజరై ప్రసంగించారు. కార్యక్రమంలో వాసవి క్లబ్ మాజీ అధ్యక్షులు భవిరిశెట్టి బంగారు బాబు, అధ్యక్షులు పద్మావతి, వాసవి క్లబ్ మెంబెర్లు, మహిళలు పాల్గొన్నారు.

నర్సీపట్నంటౌన్: స్థానిక ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో వైసిపి మహిళా ప్రజాప్రతినిధులను ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్‌గణేష్ ఘనంగా సత్కరించారు. ఎమ్మెల్యే సతీమణి కళావతి, మున్సిపల్ చైర్ పర్సన్, కౌన్సిలర్లు, సర్పంచులకు అభినందించారు.

మారేడుమిల్లి : స్థానిక గిరిజన గురుకుల పాఠశాలలో ప్రిన్సిపాల్ ఎస్ సత్యవేణి అధ్యక్షతన జరిగిన మహిళా దినోత్సవంలో కేక్ కట్ చేశారు. అనంతరం మహిళా సిబ్బందికి చిరు కానుకలు అందించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ రత్నశ్రీ, ఉపాధ్యాయులు జ్యోతిర్మయి, నాగరత్నం, ఐ.ప్రభాకరరావు పాల్గొన్నారు.

చింతూరు : అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా మహిళా టీచర్లు చింతూరు ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వాసం సుజాత, మిడియం సుజాత, తులసి, కవిత, సీత, మీనా, పాండ్రు, లక్ష్మి, పాల్గొన్నారు.

అరకులోయ రూరల్: మండలంలోని కొత్తవలస గ్రామంలో ఐద్వా ఆధ్వర్యంలో మహిళా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఐద్వా రాష్ట్ర కమిటీ సభ్యులు వివి జయ మాట్లాడుతూ, ప్రభుత్వాలు మారినా మహిళల పరిస్థితిలో మార్పు లేదన్నారు. కమిటీ సభ్యులు సన్యాసమ్మ, లక్ష్మి, రాధా, సుందరమ్మ, నీలమ్మ పాల్గొన్నారు.

చింతపల్లి: మండలంలోని లోతుగెడ్డ జంక్షన్ గ్రామంలో కేబి ఫౌండేషన్ స్వచ్ఛంద సేవా సంస్థ మండల కో ఆర్డినేటర్ దుక్కెరి గంగమ్మ ఆధ్వర్యాన మహిళా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కేబి ఫౌండేషన్ చైర్మన్ కొక్కుల కన్నబాబు, జిల్లా కో ఆర్డినేటర్ వంతల నాగేశ్వరరావు, ముఖ్య సలహాదారుడు తలారి జానకిరామ్, మన్యం గాయకుడు దుడ్డు సత్యనారాయణ పాల్గొన్నారు.

పెదబయలు : మండలంలోని బంగారుమెట్ట, వడ్డెపుట్, కొత్తపుట్టు గ్రామాల్లో మహిళా దినోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఐద్వా మహిళా అధ్యక్షురాలు టి.కౌసల్య, పౌరహక్కుల, హత్యాచారాల నిరోధక చట్టం జిల్లా కమిటీ మెంబర్ చెండా లోహితాసుడు పాల్గొన్నారు.

మహిళా అధికారులను సత్కరిస్తున్న అనకాపల్లి ఎంపీ సత్యవతి

నర్సీపట్నంలో మహిళా దినోత్సవ వేడుకల్లో ఎమ్మెల్యే గణేష్

మిలీనియం సాఫ్ట్‌వేర్ సొల్యూషన్స్‌లో మహిళా దినోత్సవం

ఎన్ఎస్‌టిఎల్‌లో జరిగిన వేడుకల్లో పాల్గొన్న మహిళామణులు

ఐద్వా, ప్రజాసంఘాల ఆధ్వర్యాన..

మాట్లాడుతున్న ఐద్వా విశాఖ జిల్లా అధ్యక్షురాలు పద్మ

పోరాటాల ఫలితమే... : ఐద్వా జిల్లా అధ్యక్షులు బి. పద్మ

ప్రజాశక్తి -గాజువాక : ఎన్నో పోరాటాల ఫలితంగానే మహిళా దినోత్సవం ఏర్పాటైందని ఐద్వా జిల్లా అధ్యక్షురాలు బి పద్మ అన్నారు. శుక్రవారం తోకాడ సమైక్య అపార్ట్‌మెంట్‌లో అసోసియేషన్ మహిళా అధ్యక్షురాలు మణి అధ్యక్షతన మహిళా దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, సమాన హక్కుల కోసం 113ఏళ్ల క్రితం మహిళలు చేసిన పోరాటాన్ని వివరించారు. సమ్మెలు, అరెస్ట్‌లు, వివిధ ఉద్యమాలతో మహిళాదినోత్సవం సాక్షాత్కారమైందని, తర్వాతే మేడే, ఇతరత్రా పోరాటాలు రూపుదాల్చాయన్నారు. ఓపిక, శక్తిమంతులైన మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తున్నా, నేటికీ వివక్షకు గురికావడంపై ఆవేదన వెలిబుచ్చారు. ఐద్వా స్టీల్ డివిజన్ కార్యదర్శి కె.వేణు మాట్లాడుతూ, స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ చర్యలు వేగవంతమౌతున్న నేపథ్యంలో పోరాటంలో మహిళలు భాగస్వాములు కావాలన్నారు. తోకాడ సమైక్య అపార్టెమెంట్ అసోసియేషన్ అధ్యక్షులు ఎం.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ, నేటికీ మహిళలపై దాడులు, వేధింపులు కొనసాగడం దారుణమని, వీటిని నియంత్రించాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. కార్యక్రమంలో ఎస్ఐ మన్మధరావు, ఐదవ స్టీల్ డివిజన్ అధ్యక్షులు కె.వరలక్ష్మి, అసోసియేషన్ కార్యదర్శి ఎ.తవితయ్య పాల్గొన్నారు.ఈ సందర్భంగా ప్రజాశక్తి ముద్రించిన మహిళా దినోత్సవ ప్రత్యేక సంచికను ఆవిష్కరించారు.

అక్కిరెడ్డిపాలెంలో.. అక్కిరెడ్డిపాలెంలో ఐద్వా ఆధ్వర్యంలో మహిళా దినోత్సవం జరిగింది.రమణమ్మ, శ్రీలక్ష్మి స్థానిక ఐద్వా నాయకులు పాల్గొన్నారు.

గాజువాక : 71 వ వార్డు శ్రీరాంనగర్ సమైక్య అపార్ట్‌మెంట్‌లో ఐద్వా స్టీల్ జోన్ కార్యదర్శి కె.వేణు అధ్యక్షతన మహిళా దినోత్సవాన్ని నిర్వహించారు. మహిళలకు ఆటలు పోటీలు నిర్వహించి బహుమతులను అందజేశారు. ఐద్వానేతలు కె. సంతోషం, కృష్ణవేణి, సంధ్య, ఎ.కుమారి, టి శాంతి, వై రాజేశ్వరి, భవాని, శ్రీదేవి పాల్గొన్నారు.

భీమునిపట్నం : హక్కుల కోసం మహిళలు ఐక్యంగా పోరాడాలని ఐద్వా భీమిలి డివిజన్ కార్య దర్శి కె నాగరాణి పిలుపు నిచ్చారు. భీమిలి జోన్ మరిడమ్మ పేటలో ఐద్వా ఆధ్వర్యాన మహిళా దినోత్సవం నిర్వహించారు ఐద్వా జోన్ కమిటీ సభ్యులు ఎస్ గుణ, యు పార్వతి, కల్యాణి, లలిత, వరలక్ష్మి పాల్గొన్నారు

పెందుర్తి : రైతుబజార్ వద్ద ఐద్వా ఆధ్వర్యంలో మహిళా దినోత్సవ ర్యాలీ నిర్వహించారు. ఐద్వా నేత బి. రమణి మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు మహిళా హక్కులను కాలరాస్తున్నాయని, మహిళాబిల్లుకు పార్లమెంట్ ఆమోదం తెలిపినా అమలు జరగడం లేదన్నారు. సిఐటియు జిల్లా నాయకులు జగన్, అప్పలనాయుడు, అంగన్వాడీ జిల్లా సెక్రటరీ దేవి, విజయలక్ష్మి పాల్గొన్నారు.

మధురవాడ: జివిఎంసి ఐదవ వార్డు శారదా నగర్‌లో ఐద్వా ఆధ్వర్యంలో మహిళా దినోత్సవ ర్యాలీ నిర్వహించారు. ఐద్వా జోన్ కార్యదర్శి బి భారతి మాట్లాడుతూ, పోరాడి సాధించుకున్న హక్కుల పరిరక్షణకు ఉద్యమిద్దామన్నారు. ఐద్వానేతలు ఎల్ పద్మ, ఆర్ లక్ష్మి, ఎం గాయత్రి, ఆర్ భారతి, బి శశి పాల్గొన్నారు

ములగాడ : మహిళదినోత్సం సందర్భంగా శ్రీహరిపురం నుంచి కోరమండల్ వరకు సిఐటియు, ఐద్వా ఆధ్వర్యాన ర్యాలీ, సభ నిర్వహించారు. ఐద్వా జోన్ అధ్యక్ష, కార్యదర్శులు బి.మమత, ఆర్.విమల మాట్లాడుతూ, కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం మహిళా హక్కులను కాలరాస్తోందన్నారు. ఐద్వా సభ్యులు నిర్మల, అరుణ జగదీశ్వరి, కృష్ణవేణి, ఈశ్వరమ్మ, గీత, రుద్ర, పొలమ్మ సిఐటియు జోన్ అధ్యక్షులు కె.పెంటారావు, బి.రాంబాబు, కె.రమణ రాము పాల్గొన్నారు.

సీతమ్మధార : హామీలలోనే తప్ప అమలులో మహిళాసాధికారిత సాకారం కావడం లేదని ఐద్వా రాష్ట్ర సహాయ కార్యదర్శి గంగరాపు ప్రియాంక అన్నారు. అక్కయ్యపాలెంలో శ్రామిక మహిళా కార్మిక సంఘం ఆధ్వర్యంలో మహిళా దినోత్సవ సదస్సులో మాట్లాడుతూ, చట్టాలన్నీ కేంద్రంలోని మోడీ ప్రభుత్వంన నిర్వీర్యం చేస్తుంటే, రాష్ట్రంలోని వైసిపి ప్రభుత్వం కనీసం ప్రశ్నించే స్థితిలో లేదని, మహిళా హక్కులను పోరాడి సాధించుకుందామని పిలుపునిచ్చారు. సమావేశంలో కుమారి, జ్యోతి, సుందరి, సూర్య కుమారి పాల్గొన్నారు.

రాజ్యాంగ హక్కులను కాలరాస్తున్న ప్రభుత్వాలు

అనకాపల్లి : మహిళలకు రాజ్యాంగం కల్పించిన హక్కులను ప్రభుత్వాలు కాలరాస్తున్నాయని ఐద్వా జిల్లా నాయకురాలు డిడి వరలక్ష్మి ఆందోళన వ్యక్తం చేశారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా శుక్రవారం అనకాపల్లి మండలం సంపతిపురంలో ఐద్వా పతాకావిష్కరణ గావించారు. ఈ సందర్భంగా వరలక్ష్మి మాట్లాడుతూ మహిళా హక్కులకు రక్షణ కల్పించాలని, సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. పసిపిల్లలు, వృద్ధ మహిళలు అన్న భేదం లేకుండా అందరిపైనా లైంగిక వేధింపులు, హత్యలు, అత్యాచారాలు జరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం నూతన కమిటీ ఎన్నిక జరిగింది. కె.లావణ్య, కె.లక్ష్మి, కె.వరలక్ష్మి, బి.లక్ష్మి, కె.జయ, కోనిశెట్టి లక్ష్మి, ఎస్.శాంతి, జి.బంగారమ్మ, కోరుకొండ రత్నకుమారి పాల్గొన్నారు.

మహిళా దినోత్సవ స్ఫూర్తితో పోరాటాలకు సిద్ధం కావాలి

రాజవొమ్మంగి: స్కీం వర్కర్లు తమ సమస్యల పరిష్కారం కోసం అంతర్జాతీయ మహిళా దినోత్సవం స్ఫూర్తితో పోరాటాలకు సిద్ధం కావాలని గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్షులు లోతా రామారావు పిలుపునిచ్చారు. స్థానిక ఆర్ అండ్ బి అతిథి గృహం వద్ద సిఐటియు మండల అధ్యక్షులు కె.వెంకటలక్ష్మి అధ్యక్షతన జరిగిన అంతర్జాతీయ మహిళా దినోత్సవంలో లోతా రామారావు ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. మహిళల హక్కులు, ఆత్మగౌరవం కోసం ప్రపంచ వ్యాప్తంగా ప్రతి ఏటా మహిళా దినోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు చెప్పారు. సామాజిక, ఆర్థిక, రాజకీయ, సాంస్కృతిక సమానత్వాన్ని సాధించడానికి మహిళలను ప్రోత్సహించడం మహిళా దినోత్సవం ముఖ్య ఉద్దేశని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడి, ఆశా, మిడ్డే మీల్స్ సంఘాల నాయకులు సిహెచ్.కుమారి, రమణి, రాజేశ్వరి, చిన్నమ్ములు, మేరీ, రత్నం, భవాని, రాధ, లక్ష్మి, సత్యవతి, సరస్వతి తదితరులు పాల్గొన్నారు.

విఆర్.పురం : అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా శుక్రవారం ఐద్వా మండల కమిటీ సభ్యురాలు గంపల జయ అధ్యక్షతన సదస్సు నిర్వహించారు. ఇందులో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఐద్వా జిల్లా కార్యదర్శి ఐ.పద్మ మాట్లాడుతూ అవనిలో సగం ఉన్న మహిళలకు అన్నీ చోట్లా ఇబ్బందులు ఎదురవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం వెలుగు విఒఎ వై.విజయలక్ష్మిని సన్మానించారు. కార్యక్రమంలో ఐద్వా నాయకులు తోట రమణ, సావిత్రమ్మ, వెంకట నరసమ్మ, పద్మ, రజిని, డాక్టర్ దీనమ్మ, డ్వాక్రా మహిళలు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఐద్వా రాష్ట్ర సహాయ కార్యదర్శి ప్రియాంక

అనకాపల్లిలో ఐద్వా పతాకావిష్కరణలో మహిళా నేతలు

మల్కాపురంలో ఐద్వా ర్యాలీ

పెందుర్తిలో మాట్లాడుతున్న ఐద్వా నేత రమణి

రాజవొమ్మంగిలో మాట్లాడుతున్న రామారావు

సిఎం రిలీఫ్ ఫండ్ చెక్కు అందజేత

బాధితునికి చెక్‌ను అందజేస్తున్న కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి

ప్రజాశక్తి-కశింకోట : కశింకోటలో హౌసింగ్ కాలనీకి చెందిన పావాడ సన్యాసిరావు కుమారుడు బాలాజీకి ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి ఆర్థిక సాయం చెక్కును గురువారం అందజేశారు. బాలాజీకి రెండేళ్ల క్రితం తలకు ఆపరేషన్ జరిగింది. గురువారం ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి చేయూత కార్యక్రమానికి వచ్చిన సందర్భంగా సన్యాసిరావు ముఖ్యమంత్రిని కలిసి తన పరిస్థితిని వివరించి సిఎం రిలీఫ్ ఫండ్ సహాయం చేయాలని అభ్యర్థించారు. దీంతో సీఎం కలెక్టర్ రవి పఠాన్ శెట్టికి ఆదేశాలు జారీ చేయడంతో కలెక్టర్ కార్యాలయంలో బాలాజీతో పాటు, 19 మందికి సీఎం రిలీఫ్ ఫండ్ లక్ష రూపాయల చెక్కులు అందించారు.

'దక్షిణం టికెట్ కేటాయించాలి'

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : విశాఖ దక్షిణ నియోజకవర్గం టిక్కెట్టును అన్ని ప్రధాన రాజకీయ పార్టీలు ముస్లింలకు కేటాయించాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం చెంగలరావుపేట జామియా మసీదు, అల్లిపురం మసీద్ ఎ ఫిర్దోస్ వద్ద ముస్లింలు ప్రదర్శనలు నిర్వహించారు. ముస్లింలకు అసెంబ్లీ టికెట్ కేటాయించాలని నినాదాలు చేశారు. ఈ సందర్భంగా మసీద్ ఎ ఫిర్దోస్ కమిటీ అధ్యక్షులు మహబూబ్ షరీఫ్ మాట్లాడుతూ విశాఖ జిల్లా జనాభాలో ముస్లింలు రెండో స్థానంలో ఉన్నారన్నారు. అయినప్పటికీ వారికి జిల్లాలో సరైన ప్రాతినిధ్యం ప్రధాన రాజకీయ పార్టీలు కల్పించకపోవడం దారుణమన్నారు. జామియా మసీద్ ప్రెసిడెంట్ అక్బర్ మాట్లాడుతూ దక్షిణ నియోజకవర్గంలో 25 వేల మంది ముస్లిం ఓటర్లు ఉన్నారని తెలిపారు. వచ్చే ఎన్నికల్లో తమకు ప్రధాన పార్టీలు టికెట్ ఇవ్వకపోతే ముస్లిం నేత ఇండిపెండెంట్ అభ్యర్థిగా పోటీ చేస్తారని తెలిపారు.

జాతీయస్థాయి బాక్సింగ్ పోటీల్లో సత్తా చాటాలి

ప్రజాశక్తి-అనకాపల్లి : జమ్మూ కాశ్మీర్లో ఈనెల 26 నుంచి 30 వరకు జరగనున్న జాతీయ బాక్సింగ్ పోటీల్లో అనకాపల్లికి చెందిన బాక్సింగ్ క్రీడాకారులు సత్తా చాటాలని అనకాపల్లి జిల్లా బాక్సింగ్ అసోసియేషన్ అధ్యక్షులు మల్ల సురేంద్ర ఆకాంక్షించారు. ఇటీవల విశాఖపట్నం గోపాలపట్టణంలో జరిగిన బాక్సింగ్ పోటీల్లో మారేడుపూడి కాలనీకి చెందిన ఈగల రక్షిత్, అడివి వరపు విశాల్, సిల్వర్ మెడల్ సాధించారు. అలాగే నారపిన్ని తులసి రామ్ జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఈ నేపథ్యంలో శుక్రవారం మల్ల సురేంద్ర స్వగృహంలో వారిని అభినందించారు. బాక్సింగ్ రంగంలో అనకాపల్లికి మంచి పేరు తీసుకురావాలని కోరారు. మహిళా దినోత్సవం సందర్భంగా నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ స్పోర్ట్స్ కోచ్ కోరుకొండ అరుణని సత్కరించారు. కార్యక్రమంలో కోచ్ కోరుకొండ హరీష్ తదితరులు పాల్గొన్నారు.

విజేతలను అభినందిస్తున్న మల్ల సురేంద్ర

ప్రమాదాలకు నెలవుగా మద్ది గోస్తనీ వంతెన

ప్రజాశక్తి -పద్మనాభం. మండలంలోని మద్ది వద్ద గోస్తనీ నదిపై వంతెన ప్రమాదాలకు నెలవుగా మారిందని వాహన దారులు బెంబేలెత్తుతున్నారు. విజయనగరం, సింహాచలం ప్రధాన మార్గంలో వంతెన కావడంతో ఈ రహదారిలో బైకులు, బస్సులు, కార్లు, ఆటోలు, లారీలు ఇతర వాహనాల రాకపోకలు అధికంగా ఉంటాయి. ఈ నేపథ్యంలో వంతెనపై ఖానాల మధ్య ఏర్పడ్డ ఖాళీల్లో బైక్స్, చిన్న వాహనాలు పడడంతో వీల్స్ విరిగి ప్రమాదాలు జరుగుతున్నాయని, పెద్దవాహనాలైతే ఎగిరెగిరి పడుతూ వెళ్లాల్సి వస్తోందని వాపోతున్నారు. మద్ది వద్ద గోస్తని వంతెనపై నిత్యం నాలుగైదు ప్రమాదాలైనా సర్వసాధారణమైన నేపథ్యంలో సంబంధిత ఆర్అండ్‌బి అధికారులు పరిష్కార చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.


గోస్తనీ వంతెనపై ఏర్పడ్డ గోతులు

మహిళల చదువు కోసం 'కలలకు రెక్కలు'

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : మహిళల ఉన్నత చదువు కోసం టిడిపి, జనసేన కలిసి కొత్తగా కలలకు రెక్కలు కార్యక్రమం తీసుకువచ్చాయని తెలుగు మహిళ రాష్ట్ర అధ్యక్షురాలు వంగలపూడి అనిత అన్నారు. అందుకోసం రూపొందించిన పోస్టర్‌ను శుక్రవారం టిడిపి కార్యాలయంలో ఆమె ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఉమెన్స్ డే సందర్భంగా కలలకు రెక్కలకు సంబంధించి ఓ వెబ్‌సైట్‌ను అందుబాటులోకి తెచ్చామన్నారు. ఆర్థిక ఇబ్బందులు కారణంగా ఇంటర్మీడియట్ తర్వాత విద్యార్థినులు చదవలేకపోతున్నారన్నారు. కేవలం 20 శాతం మంది మాత్రమే డిగ్రీ చదువుతున్నారని తెలిపారు. కలలకు రెక్కలు కార్యక్రమం ద్వారా హయ్యర్ స్టడీస్‌కు వెళ్లవచ్చునని అన్నారు. 9261292612 నెంబర్‌కు మిస్డ్ కాల్ ఇస్తే వారికి సహాయం అందుతుందన్నారు. జగన్ హయాంలో మహిళలకు రక్షణ కరువైందని తెలిపారు.

ముద్రగడతో కాపులు లేరు

ముద్రగడ పద్మనాభం వైసిపిలోకి వెళ్లినంత మాత్రాన కాపులు ఆయన వెంట వెళ్లరని తెలుగు మహిళ రాష్ట్ర అధ్యక్షురాలు వంగలపూడి అనిత అన్నారు. శుక్రవారం టిడిపి కార్యాలయంలో ఆమె మీడియాతో మాట్లాడుతూ పవన్ కల్యాణ్ చాలా క్లారిటీతో ఉన్నారన్నారు. ముద్రగడ వైసిపి కోవర్టు అని కాపులకు తెలుసునన్నారు.

నేరాలు ఘోరాలు

గాయపడిన వ్యక్తి మృతి

ప్రజాశక్తి -మధురవాడ: ఇంట్లో పనులు చేస్తూ ప్రమాదవశాత్తు జారిపడిన వ్యక్తి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. పిఎం.పాలెం సిఐ వై.రామకృష్ణ చెప్పిన వివరాలివి. జివిఎంసి ఆరోవార్డు జెఎన్ఎన్‌యుఆర్ఎం కాలనీ, గాయత్రినగర్ బ్లాక్ నెంబరు 10, జిఎఫ్1లో షేక్‌జిలాని (33) తన భార్య ఫాతిమాతో నివాసముంటున్నాడు. ఈనెల 5న ఇంట్లో పనిచేస్తుండగా, జిలాని ప్రమాదవశాత్తు కాలుజారి పడడంతో గాయపడ్డాడు.కెజిహెచ్‌కు తరలించి చికిత్స అందించినప్పటికీ ఆరోగ్యం విషమించడంతో శుక్రవారం రాత్రి మృత్యువాతపడ్డాడు. భార్య ఫాతిమా ఫిర్యాదు మేరకు దర్యాప్తు చేస్తున్నట్లు సిఐ రామకృష్ణ తెలిపారు.

స్టీమ్ లీకేజీతో ఇద్దరు కార్మికులకు గాయాలు

ప్రజాశక్తి -ములగాడ: స్టీమ్ లీక్‌తో ఇద్దరు కార్మికులు గాయాలు పాలైన ఘటన హెచ్‌పిసిఎల్‌లో శుక్రవారం చోటుచేసుకుంది. మల్కాపురం పోలీసులు తెలిపిన వివరాలివి.

హెచ్‌పిసిఎల్ విశాఖ రిఫైనరీలోని డిహెచ్‌టిఎస్ఆర్‌యు షట్ డౌన్ పనుల్లో భాగంగా పైపులైన్లను స్టీమింగ్ చేస్తుండగా ఒక్కసారిగా లీకేజీ కావడంతో అక్కడ విధులు నిర్వహిస్తున్న ప్రమోద్‌సింగ్, స్వరూప్ అనే ఇద్దరు సిఆర్3 కార్మికులకు కాలిన గాయాలయ్యాయి. క్షతగాత్రులను సంస్థ డిస్పెన్సరీలో ప్రథమ చికిత్స అనంతరం ఆరిలోవ అపోలో ఆసుపత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న సంస్థ అధికారులు గాయపడిన కార్మికులను పరామర్శించారు. మల్కాపురం సిఐ ఆధ్వర్యంలో ఎస్ఐ దేవుడమ్మ కేసు దర్యాప్తు చేస్తున్నారు,

ఆసియా రోడ్ రేసింగ్ ఛాంపియన్‌షిప్ కోసం..

ఇండియన్ ఆయిల్, ఎఫ్ఐఎం భాగస్వామ్యం

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : ఆసియా రోడ్ రేసింగ్ ఛాంపియన్‌షిప్ కోసం అధికారిక ఫ్యూయల్ భాగస్వామ్యానికి ఎఫ్ఐఎం (ఫెడరేషన్ ఇంటర్నేషనల్ డి మోటోసైక్లిస్మే) ఇండియన్ ఆయిల్‌తో భాగస్వామ్యం కుదుర్చుకుందని ఇండియన్ ఆయిల్ చైర్మన్ శ్రీకాంత్ మాధవ్ వైద్య తెలిపారు. నగరంలోని ఓ హోటల్లో ఆయన మీడియాతో మాట్లాడుతూ ఈ భాగస్వామ్యం మూడేళ్ల పాటు ఉంటుందన్నారు. ఎఆర్ఆర్‌సి ఈవెంట్‌లలో స్టార్మ్ అల్టిమేట్ రేసింగ్ ఫ్యూయల్ కేటగిరీ 2 రేస్ ఇంధనాన్ని అందించనుందన్నారు. ఇండియన్ ఆయిల్ గుజరాత్ రిఫైనరీలో ఈ స్టార్మ్ ఉత్పత్తి అవుతుందన్నారు.